



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 05.08.2025 | సంపుటి : 2 | సంచిక :183 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Thuesday | 05.08.2025 | volume : 2 | Issue : 183 | Pages : 8 | Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




06

మన భూభాగాన్ని చైనా

## ఆక్రమించిందని మీకెలా తెలుసు?

రాహుల్‌కు సుప్రీం ప్రశ్న



06

శ్రీకృష్ణుడే తొలి మధ్యవర్తిత్వ

## రాయబారి

యూపి కేసులో సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు



04

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి

## శిబూసోరెన్ కన్నుమూత

ప్రముఖుల నివాళులు




# అసెంబ్లీకి కాళేశ్వరం కమిషన్ నివేదిక

### అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం

### లక్షకోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం : సీఎం రేవంత్‌రెడ్డి

### కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ ఆమోదం

హైదరాబాద్, ఆగస్ట్ 4 :

కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాక భవిష్యత్తు కార్యాచరణతో పాటు కమిషన్ సూచనలను అమలు చేసేందుకు ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

02



## లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్

- హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు
- 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ
- లిల్లీ ఫార్మా కంపెనీ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

02

# అరెస్ట్ చేసిన భయపడేది లేదు

- కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని
- కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టాలి
- పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపు



గజ్వేల్, ఆగస్ట్ 4 :

కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దామని పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు.

03

# రాష్ట్రపతితో ప్రధాని, అమిత్‌షా వేర్వేరుగా భేటీ

### కాశ్మీర్‌కు రాష్ట్రపతి హోదాపై ఊహాగానాలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహెూదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారం ఊపందుకుంది.



02

# భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తా

### మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇటీవల భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. తాజాగా మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపించారు.



04

# జాగృతి కవిత ఎవరో తెలియదు

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- నల్లగొండలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం
- ఇందిరాభవన్‌గా నామకరణం
- ఫోన్ చేసి అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

03





## కేవలం బిసిలకే 42శాతం రిజర్వేషన్లు

- 10శాతం ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించం
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు

03

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

- ఇందిరాపార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష
- కోర్టు అనుమతి నిరాకరణతో విరమణ

ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు. ఈ నిరాహార దీక్షకు కోర్టు అనుమతి నిరాకరించిందని చెప్పారు. దీంతో తాను చేపట్టిన ఈ దీక్షను విరమిస్తున్నట్లు తెలిపారు.



02



02

## జర్నలిజంలో నైపుణ్యాలకే ప్రాధాన్యం

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

# మరిన్ని కష్టాల్లో అనిల్ అంబానీ

### డజనుకు పైగా బ్యాంకులకు ఈడీ నోటీసులు..

రిలయన్స్ గ్రూప్ అధిపతి అనిల్ అంబానీ కష్టాలు మరింత పెరిగాయి. ఇప్పటికే మనీలాండరింగ్ కేసులో ఆయన పాత్రపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా పలు బ్యాంకులకు నోటీసులు జారీ చేసి వివరాలను కోరింది. వీటిల్లో ఆయన కంపెనీలకు చెందిన రుణ మంజూరు పత్రాలు వంటివి ఉన్నాయి.



07

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

- నాలాలు పొంగి పొర్లడంతో ట్రాఫిక్ జామ్
- అవసరమైతేే తప్ప బయటకు రావద్దని హెచ్చరిక

కొన్నిరోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుతున్న రైతులకు వాతావరణం చల్లటి జల్లులకబురు చెప్పింది. సోమవారం తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కుండపోత వాన కురవటంతో రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని ముందుగా వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



03



## రాష్ట్రపతితో ప్రధాని, అమిత్‌షా వేర్వేరుగా భేటీ

### కాశ్మీర్‌కు రాష్ట్రపతి హోదాపై ఊహాగానాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 :** జమ్మూకశ్మీర్ కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించనున్నారనే ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదివారంనాడు ఒకరి తరువాత మరొకరు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ధ్రువీకరించింది. అయితే ఈ సమావేశాల వెనుక కారణం ఏమిటనేది మాత్రం స్పష్టం చేయలేదు. అమిత్‌షా తన కసరత్తులో భాగంగా పలువురు బీజేపీ నేతలు, అప్పటి జమ్మూకశ్మీర్ రాష్ట్ర బీజేపీ చీఫ్‌లతో సమావేశమైనట్టు- కూడా చెబుతున్నారు. ప్రధానమంత్రి మోదీ సైతం మంగళవారంనాడు ఎన్డీయే ఎంపీలతో కీలక సమావేశం జరుపనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆగస్టు 5న 370వ అధికరణ రద్దు యానివర్శిరీ కావడంతో ఆరోజు కీలక ప్రకటన ఏదో ఉండవచ్చని, ముందస్తు కసరత్తులో భాగంగానే కీలక సమావేశాలు జరుగుతున్నాయని ఊహాగానాలు వెలువడుతున్నాయి. కాగా, ఈనెల మొదటి రెండు రోజుల్లో జమ్మూకశ్మీర్ బీజేపీ మాజీ చీఫ్ సత్ పాల్ శర్మ, లద్దాఖ్ లెప్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తాలతో అమిత్‌షా సమావేశమయ్యారు. ఆల్ జమ్మూ అండ్ కశ్మీర్ షియా అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్రాన్ రజా అన్సారి సైతం సోమవారంనాడు అమిత్‌షాతో సమావేశమయ్యారు. ఢిల్లీలో వరుస సమావేశాల నేపథ్యంలో ఆగస్టు 5న కీలక ప్రకటన వెలువడే అవకాశాలపై సోషల్ మీడియాలోనూ చర్చ జరుగుతోంది. దీనిపై రిటైర్డ్ ఆర్మీ అధికారి, రచయిత కన్వల్ జీత్ సింగ్ థిల్లాన్ మాట్లాడుతూ, కశ్మీర్‌లో శాంతి కోసం ఎన్నో విలువైన ప్రాణాలను కోల్పోయామని, ఆ కారణంగా ఎలాంటి తొందరపాటు- నిర్ణయాలు తీసుకోరాదని అన్నారు. శాంతి పునరుద్ధరణ పక్రియ కొనసాగుతున్నం దున్న పరిస్థితి మొత్తం సానుకూలమయ్యేంత వరకూ వేచిచూడాలని, హడావిడి నిర్ణయం మంచిది కాదని చెప్పారు. రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారనే బలమైన ఊహాగానాలు వస్తున్న విషయం నిజమేనని విశ్లేషకులు అన్నారు. అయితే మరో విచిత్రమైన వాదన కూడా వినిపిస్తోందని, కశ్మీర్, జమ్మూను వేరు చేసి రెండు వేర్వేరు రాష్ట్రాలుగా గుర్తిస్తారనే ప్రచారం ఒకటి ఉందని, అదే జరిగితే ఇంతకంటే వినాశకర పరిణామం మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

## మద్యం మత్తులో ఆర్మీ అధికారి ర్యాష్ డ్రైవింగ్

### 30మందికి గాయాలు

**నాగ్‌పూర్, ఆగస్టు 4 :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓ ఆర్మీ అధికారి మద్యం మత్తులో కారు నడిపి 30 మందిని ఢీకొట్టాడు. హర్ష్‌పాల్ మహదేవ్ అనే ఆర్మీ అధికారి ఆదివారం రాత్రి 8.30 గంటలకు నాగర్ధాన్‌లోని దుర్గా చౌక్ నుంచి హమ్లాపురికి కారు బయలుదేరాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతని డ్రైవింగ్‌లో కారు నియంత్రణ కోల్పోయి 30 మంది పాదచారులను ఢీకొట్టింది. అనంతరం బోల్తాపడి.. పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. స్థానికులు హర్ష్‌పాల్‌ను కారులో నుంచి బయటకు తీసి నిర్లక్ష్యంగా కారు నడిపినందుకు బాధితుల బంధువులతో కలిసి చితకబాదారు. తీవ్రంగా దాడి చేయడంతో ఆర్మీ అధికారి ముఖంపై తీవ్ర గాయలయ్యాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని.. హర్ష్‌పాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఘటనలో గాయపడిన వారికి కూడా వైద్యం అందిస్తున్నట్లు- పోలీసులు తెలిపారు. అస్సాంలోని సైన్యంలో సదరు వ్యక్తి పని చేస్తున్నట్లు- నాలుగు రోజుల సెలవుల్లో భాగంగా మహారాష్ట్రలోని స్వగ్రామం వచ్చినట్లు- పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కౌశిక్ రెడ్డిపై కేసుల్లో స్టే

**హైదరాబాద్, ఆగస్టు 4 :** తనపై పలు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పలు పోలీసుస్టేషన్‌లలో కౌశిక్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదుతో.. ఒకే ఘటనపై వేర్వేరు పోలీసు స్టేషన్‌లలో కేసులు పెట్టారని కౌశిక్ రెడ్డి న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. కేసులపై స్టే విధించి, అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని మధ్యంతర పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. అన్ని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.



## జర్నలిజంలో నైపుణ్యాలకే ప్రాధాన్యం

### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4 :** నైపుణ్యంతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి భవనంలో గిరిజన జర్నలిస్టులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులు వృత్తితోపాటు- తమని తాము తీర్చిదిద్దుకుంటూ జర్నలిజంపట్ల ఆసక్తి కనబరిచేలా వార్తలు రాయాలన్నారు. అందులోభాగంగానే గిరిజన జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా విడతల వారీగా ఈ జర్నలిస్టుల శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమాచార శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, గిరిజన జర్నలిస్టులకు మీడియా అకాడమి శిక్షణా తరగతులు నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. నేను కూడా గిరిజన బిడ్డనే కాబట్టి ఈ విధంగా మిమ్మలను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా శిక్షణలో పాల్గొంటున్న గిరిజన విలేకరులు మన గిరిజన జాతి ఔన్నత్యాన్ని చాటేలా కృషి చేయాలని కోరారు. శిక్షణా తరగతులలో ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్‌లో వస్తున్న వార్తల గురించి వివరించారు. దిశ ఎడిటర్ మార్కండేయ వార్తా కథనాలు – ప్రత్యేక కథనాలు ఎలా రాయాలో తెలియజేశారు. గిరిజన జర్నలిస్టులు అడవి బిడ్డలు కాబట్టి వారు ప్రత్యేక వ్యాసాలు రాయాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి నేర వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలు లలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం- 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, గిరిజన జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.



## సోషల్ మీడియా జర్నలిస్టులపై సీఎం అసహనం

### సీఎం వ్యాఖ్యలను తప్పపట్టిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4 :** సోషల్ మీడియా జర్నలిస్టుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తప్పుపట్టారు. సోషల్ మీడియాపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలకు రాజగోపాల్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సామజిక బాధ్యతతో పనిచేసే వారిని గౌరవించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను అనవానించడం సబబు కాదని సూచించారు. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు తన మద్దతు ఎప్పుడూ ఉంటు-ందని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. 'ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలే తప్ప.. అవమానించడం సబబు కాదు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా మొదటినుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉంది. నిబద్దతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలంటూ ప్రధాన మీడియా వారిని ఎగదోయడం ముమ్మాటికీ విభజించి పాలించడమే. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదు' అని రాజగోపాల్ రెడ్డి ట్వీట్ చేశారు.

## అసెంబ్లీకి కాళేశ్వరం కమిషన్ నివేదిక

- అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం
- లక్షకోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం : సీఎం రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 4 :** కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదిక కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దీనిని అసెంబ్లీలో పెడతామని అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు- తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాక భవిష్యత్తు కార్యాచరణతో పాటు- కమిషన్ సూచనలను అమలు చేసేందుకు ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఎవరిపైనా కక్ష సాధింపులు, వ్యక్తిగత ద్వేషం తమ ఉద్దేశం కాదనే అన్ని వివరాలనూ మీడియా ముందు ఉంచామని తెలిపారు. జలవనరుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మేడిగడ్డ కుంగిపోయే ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగాన్ని దృష్టిలో పెట్టు-కొని న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్‌ను నియమించాం. ఘోష్ కమిషన్ అందరితో మాట్లాడి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇందులో రాజకీయ ఆరోపణలు లేవు. ఇది ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టు కాదు.. స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన రిపోర్టు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణ అవకతవకలు అన్నింటికీ బాధ్యుడు, జవాబుదారీ అప్పటి సీఎం కేసీఆరే అని నివేదికలో పేర్కొన్నారు. నిపుణుల కమిటీ- సూచనలకు కాకుండా సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై విచారణ చేయిస్తామని మేనిఫెస్టోలో చెప్పామని, కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన పీసీ ఘోష్ నిబద్ధత ఉన్న వ్యక్తి అని రేవంత్ చెప్పారు. కేసీఆర్, హరీష్ రావు సహా అనేక మందిని ఘోష్ విచారించారని, 16 నెలల విచారణ తరువాత 665 పేజీల నివేదిక ఇచ్చారని సీఎం తెలిపారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని..అలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిపోయిందని సీఎం విమర్శించారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్లను ప్రారంభించారని, రీడిజైనింగ్ పేరుతో కేసీఆర్ డిజైన్లను మార్చారని ఆరోపించారు. ప్రాజెక్ట్ నిర్మించిన మూడేళ్ల లోపే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని సీఎం గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా లోపాలున్నాయని రిపోర్ట్ ఇచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, త్వరలోనే అసెంబ్లీకి నివేదికను రిపోర్ట్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఏం చేయాలో నిర్ణయిస్తామని రేవంత్ చెప్పారు. ప్రజాప్రతినిధులకు కమిషన్ నివేదిక ఇస్తామని, అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పొచ్చని సీఎం రేవంత్ వెల్లడించారు. ఎవరి పైనా వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయాలు తీసుకోవడం లేదని, కమిషన్ రిపోర్ట్‌పై ఎవరు ఏ రకంగా మాట్లాడతారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## కాళేశ్వరం కోసం అధిక వడ్డీలతో రూ.84వేల కోట్ల అప్పు

### జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కేమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4 :** కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత పాలకులు అధిక వడ్డీలతో రూ.84వేల కోట్ల అప్పు తెచ్చారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. క్యాబినెట్ భేటీ- అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. మేడిగడ్డకు మార్చారని చెప్పారు. భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం.. భారత రాష్ట్ర సమితి హయాంలోనే కూలిపోయిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై న్యాయ విచారణ చేయిస్తామని గతంలోనే హామీ ఇచ్చాం. అధికారంలోకి వచ్చాక జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ చేపట్టాం. రాజకీయ అంశాలు జోడించకుండా విచారణ జరపాలని కోరాం. 660 పేజీలతో నివేదికను కమిషన్ నీటిపారుదల శాఖకు ఇచ్చింది. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ- 25 పేజీలతో సంక్షిప్తం చేసింది. 2016లో మేడిగడ్డ ప్రాజెక్టు అగ్రిమెంట్ జరిగింది. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2023లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయింది. బ్యారేజ్ కుంగుబాటు-పై ఎన్‌డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-) నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ నిర్మాణంలో ఎ÷-లానింగ్, డిజైన్‌లో లోపాలున్నాయని తేలింది. మేడిగడ్డతోపాటు- అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులోనూ ఇదే సమస్య ఉందని కమిటీ- వెల్లడించింది. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వకు అవకాశం లేదని తెలిపింది. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవన్న కేసీఆర్ నిర్ణయం నిజాయతీతో కూడింది కాదని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ- పేర్కొంది. అక్కడ తగినంత నీరు ఉందని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పారు. 70శాతం నికర నీటి లభ్యత ఆధారంగా హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చినట్లు- కేంద్రం లేఖ రాసింది. కేంద్రం నిర్ణయాన్ని కాదని నీటి లభ్యత లేదని గత ప్రభుత్వం లేఖ రాసింది. ఆ లేఖ వెనుక దురుద్దేశాలు ఉన్నాయని అర్థం అవుతోంది. కేసీఆర్ వేసిన నిపుణుల కమిటీ- మేడిగడ్డ వద్ద బ్యారేజ్ వద్దని చెప్పింది. ప్రాణహిత మీద బ్యారేజ్ కట్టొచ్చని సూచించింది.

## లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్

- హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు
- 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ
- లిల్లీ ఫార్మా కంపెనీ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4 :** లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్ కు గుర్తింపు లభించిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో ఫార్మా కంపెనీలకు జినోమ్ వ్యాలీ ప్రత్యేకమైనది అన్నారు. అమెరికాకు చెందిన ఫార్మా కంపెనీని, గచ్చిబౌలిలో ప్రముఖ లిల్లీ ఫార్మా కంపెనీని సిఎం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమిగా తెలంగాణ ఉంటుందని తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం తెలంగాణ నుంచే అందిస్తామని, హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు, అత్యధిక వ్యాక్సిన్లు తయారవుతున్నాయని అన్నారు. పరిశ్రమలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అభివృద్ధి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌ను భవిష్యత్ గ్లోబల్ హెల్త్ కేర్ హబ్‌గా మారుస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చరిత్రక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. 2000లకు పైగా లైఫ్ సెన్సెస్ కంపెనీలు హైదరాబాద్ లో ఉన్నాయని చెప్పారు. 200కి పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ ఆఫ్ ఇండియాగా మారుతోందన్నారు. 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎలీ లిల్లీ సంస్థ లీడర్ షిప్ ను, ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాను. ఈ రోజు ప్రారంభమైన లిల్లీ నూతన కేంద్రం... ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపా లను మరింత వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ టెక్నాలజీ, ఇన్నొవేషన్ సెంటర్, ప్రపంచవ్యాప్తంగా రోగులకు పరిష్కారాల కోసం



పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు- చేయడమంటే ఈ నగరం ఘనతను మీరు ప్రపంచానికి చాటి చెప్పినట్లే. హైదరాబాద్ నగరంలో టాలెంట్ ఉంది, లీడర్‌షిప్ ఉంది, విజన్ ఉంది, మంచి పాలసీ ఉంది, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అందుకే ఎలీ లిల్లీ లాంటి గ్లోబల్ లీడర్‌కు ఇది అనుకూలమైన కేంద్రంగా మారింది. భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందిందని అన్నారు. భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి 3 టీ-కాలలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారవుతుండటం మాకు గర్వకారణం. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారత దేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన- అభివృద్ధి సముదాయంగా నిలిచింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయో-టె-క్నాలజీ సంస్థల కోసం హైదరాబాద్ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మారింది. ఈరోజు, ఎలీ లిల్లీ సంస్థ రాకతో, లైఫ్ సైన్సెస్ రంగంలో మేము మరో మెట్టు-కు చేరుకున్నాం. మధుమేహం, ఆంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాలలో ఎలీ లిల్లీ సంస్థ కృషి ఒక గేమ్‌ఛేంజర్ గా నిలిచిపోతుందని అన్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం

- పోలీసులకు వరుస ఫిర్యాదులు రాక
- మరో నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు

**హైదరాబాద్, ఆగస్టు 4 :** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సంస్థ నిర్వాహకులు ఐవీఎఫ్ చికిత్సకు వచ్చిన వారిని సరోగసి పేరిట మోసం చేసి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదులు అందాయి. పలువురు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఈ మేరకు గోపాలపురం పోలీసులు మరో 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తమకు అందించిన మెడికల్ రిపోర్టులు తీసుకొచ్చి బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. నల్గొండకు చెందిన దంపతుల నుంచి ఫెర్టిలిటీ నిర్వాహకురాలు నమ్రత రూ.44 లక్షలు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, సదానందం, చెన్నారావు, అర్చన, సురేఖపై కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. సరోగసి చేస్తామని బాధితురాలికి నమ్రత హార్మోన్ ఇంజక్షన్‌లు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత కల్యాణి గ్యాంగ్ విశాఖకు పిలిచి స్పెర్మ్ తీసుకొని పంపింది. ఈ వ్యవహారంలో సరోగసి పేరుతో రూ.18 లక్షలు కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి నమ్రత, డా.విద్యులత, కల్యాణి, శేషగిరి, శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదైంది. ఎన్నారైలను కూడా నమ్రత గ్యాంగ్ మోసం చేసినట్లు- ఫిర్యాదు అందింది. బాధితుల నుంచి రూ.25 లక్షలు కాజేశారు. దీంతో నమ్రతపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన బాధితుల నుంచి ఈ గ్యాంగ్ రూ.50 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, చెన్నారావు, సురేఖపై కేసు నమోదు చేశారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

- ఇందిరాపార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష
- కోర్టు అనుమతి నిరాకరణతో విరమణ

**హైదరాబాద్, ఆగస్టు 4 :** ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు. ఈ నిరాహార దీక్షకు కోర్టు అనుమతి నిరాకరించిందని చెప్పారు. దీంతో తాను చేపట్టిన ఈ దీక్షను విరమిస్తున్నట్లు- తెలిపారు. కోర్టులను ధిక్కరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కోర్టుల పట్ల తనకు గౌరవం ఉందన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపుతూ.. బీసీల తరఫున పోరాటం చేస్తున్నామని చెప్పారు. మేము ఒక్క అడుగు వెనక్కి వేస్తే.. 10 అడుగులు ముందుకు వేస్తామని కవిత చెప్పారు. కోర్టు తీర్పును గౌరవించి ఈ దీక్షను ఇంతటితో ముగిస్తున్నామన్నారు. ఈ పోరాటం ఆగదని.. అనేక రూపాల్లో చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ధర్నాలతో సాధించేది ఏం లేదన్నారు. మీరు రాష్ట్రపతి వద్దకు వెళ్లండంటూ తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలకు ఆమె సూచించారు. అంతకుముందు ఆమె ఇందిరాపర్క్ వద్ద దీక్షకు దిగారు. తెలంగాణ జాగృతి ఈరోజు చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్ అంబేద్కర్, ఫులే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలి, ఆర్థిక అవకాశాలు రావాలి. సమాజంలో సగ భాగం బీసీలు ఉన్నారు. వాళ్లకు రాజకీయంగా సమ ప్రాధాన్యం దక్కాలనే ఉక్కు సంకల్పంతో ఈ దీక్ష చేపట్టాం. కామారెడ్డి డిక్లరేషన్‌లో



చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలని గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడుతున్నాం. అందరి ఆకాంక్ష ఒకటే.. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం భాజపా మీద నెపం పెట్టి తప్పించు కోవాలని చూస్తోంది. బీసీ బిల్లుపై భాజపా లేవనెత్తిన అనుమానాలను సీఎం నివృత్తి చేయాలి. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలి. ముస్లింలను మినహాయించి బీసీలకే 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పాలి. అప్పుడు భాజపా ఎందుకు ఒప్పుకోదో మేమూ చూస్తాం. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకు కృషి చేయాలని కవిత అన్నారు.



## బిఆర్ఎస్‌కు గువ్వల బాలరాజు రాజీనామా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 4 :** భారత్ రాష్ట్ర సమితి పార్టీకి పెద్ద షాక్‌గా మాజీ ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు డా. గువ్వల బాలరాజు రాజీనా మా చేశారు. సోమవారం తన పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు- ప్రక టించారు. ఈ నిర్ణయం సులభం కాదని, ముఖ్యంగా ఐక్యత అవసరమైన ఈ సమయంలో బాధతో తీసుకున్న నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. మన నాయకత్వంలో నేర్చుకున్నాను, ఎదిగాను, సేవ చేసాను. పార్టీ ద్వారా లభించిన గుర్తింపు, గౌరవాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటానని గువ్వల తెలిపారు. అలాగే, నా మిషన్ మాత్రం కొనసాగుతుంది – చివరి వరుసలో ఉన్న వ్యక్తిని నిలబెట్టడం నా లక్ష్యం అని స్పష్టం చేశారు. గువ్వల బలరాజు తన రాజీనామా వెనుక ఎటు-వంటి నిందలు లేవని, కేవలం గౌరవం , కృతజ్ఞతతోనే పార్టీకి వీడ్కోలు చెబుతున్నానని చెప్పారు. 'ఇది బాధతో కూడిన రాజీనామా – కానీ పార్టీ పట్ల నా గౌరవం మారదఅని తుది వాక్యంలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఈనెల 9న గువ్వల బాలరాజు బీజేపీలో చేరనున్నారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

- నాలాలు పొంగి పొర్లడంతో ట్రాఫిక్ జామ్
- అవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరిక





**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** కొన్నిరోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుతున్న రైతులకు వాతావరణం చల్లటి జల్లులకబురు చెప్పింది. సోమవారం తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కుండపోత వాన కురవటంతో రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని ముందుగా వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అనుకున్నట్లుగానే వర్షాలు రాష్ట్రం అంతటా విస్తరించాయి. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుంటే.. మరికొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం రైతులకు కాస్త ఊరటనిచ్చు అశంమని చెప్పవచ్చు. రంగారెడ్డి, వికారదాబాద్, నల్గొండ జిల్లాల్లో కొన్ని ఏరియాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్, మంచిర్యాలు, మెదక్, నాగర్ కర్నూల్, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, జిల్లాలలో తదుపరి 2-3 గంటల్లో తేలికపాటి వర్షం కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. గాలి వేగం గరిష్టంగా గంటకు 40 కి.మీ కంటే తక్కువ (గాలులలో) ఉండగా.. తేలికపాటి ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం వుందని తెలిపారు. మరోవైపు హైదరాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, జిల్లాలలో తదుపరి 2-3 గంటల్లో మోస్తరు వర్షం వచ్చే అవకాశం వుంది. హైదరాబాద్ లో వాన బీభత్సం సృష్టించింది. సోమవారం మధ్యాహ్నం మొదలైన వాన నాన్ స్టాప్ గా కురుస్తూ నగరాన్ని ముంచేసింది. కుండపోత అనే పదం కూడా తక్కువే అన్నట్లుగా కురిసిన వానకు నగరంలో ఎక్కడ చూసినా నీళ్లతో వాగులు, చెరువులను తలపించాయి. రోడ్లన్నీ నదులను గుర్తు చేశాయి. సుమారు గంటకు పైగా వర్షం కురుస్తూనే ఉంది. పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఇవాళ కురిసిన వర్షంలో సిటీలోనే సంపన్న ఏరియాగా పేరున్న జూబ్లీహిల్స్ లో అత్యధిక వర్షపాతం నమోదైంది. జడివాన కురిసినట్లుగా వర్షం దంచికొట్టడంతో జూబ్లీహిల్స్ లో 7.4 -ప వర్షపాతం నమోదైనట్లు- వాతావరణ కేంద్రం వెల్లడించింది. గంటలోగా ఇంత వర్షపాతం నమోదవ్వడం చాలా కాలం తర్వాత నగర వాసులు చూస్తున్నారు. జూబ్లీహిల్స్ తర్వాత మెహిదీపట్నంలో 5.3 -ప వర్షం కురిసింది.

ఆ తర్వాత శ్రీనగర్ కాలనీ లో 5 సెంటీ-మీటర్ల వాన నమోదైంది. ఆ తర్వాత వర్షపాతం వరుసగా బంజారాహిల్స్ 4.6, యూసఫ్ గూడా 3.9 , ఖైరతాబాద్ 3.6 , మైత్రివనం 3.4, కూకట్ పల్లి3, మెహిదీపట్నం 3 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోందైంది. మరోవైపు రాజేంద్రనగర్, కాప్రా, చర్లపల్లి, గాంధీభవన్, అత్తాపూర్, ఫలక్నామా, మల్కాజిగిరి, మూసాపేట్, ఏఎస్ రావు నగర్, మాదాపూర్, మల్లపల్లి, గోషామహల్, ఆనంద్ బాగ్ ఏరియాల్లో 2 -ప వర్షం కురిసినట్లు- వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇక భారీ వర్షం కారణంగా నగరవాసులు బయటికి రావద్దని సిటీ- ట్రాఫిక్ పోలీసులు, హైడ్రా అధికారులు సూచించారు. నాలాలు పొంగుతుండటంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జాం అవుతున్న కారణంగా.. రోడ్లపైకి వస్తే ట్రాఫిక్ లో ఇరుక్కుం టారని హెచ్చరించారు. వాన నిలిచే వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో ఎన్నడూ లేనంత వాన కురుస్తోంది. దీంతో నగరంలో వీధులన్నీ జలమయం అయ్యాయి. భారీ వరద కారణంగారోడ్లు వాగులు, నదులను తలపిస్తున్నాయి. నాలాలు పొంగుతున్నాయి.

పట్టగలే సాయంత్రం అయినట్లుగా మారిపోయింది పరిస్థితి. దీంతో పోలీసులు వాహనదారులకు, హైదరాబాదీలకు సూచనలు చేశారు. అదే విధంగా ఆఫీసుల్లో ఉన్న వాళ్లు వర్షం నిలిచే వరకు బయల్దేరవద్దని హెచ్చరించారు. భారీగా వరద పారుతుండటంతో రోడ్లపైన వాహనాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భారీగా ట్రాఫిక్ జాం అయ్యే అవకాశం ఉండటంతో వర్షం కాస్త రిలీఫ్ ఇచ్చిన తర్వాతే బయలు దేరాలని సూచించారు పోలీసులు. సిటీ- మొత్తానికి ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే చాన్స్ ఉందని.. ఎక్కడ ఉన్నవాళ్లు అక్కడే ఉండాలని సూచించారు.





## బ్యారేజీల నిర్మాణంలో కేసీఆర్‌దే తుది నిర్ణయం

### కాళేశ్వరం నివేదికపై అధికారుల కమిటీ అధ్యయనం

**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అధికారుల కమిటీ అధ్యయనం చేసింది. దీని సారాంశాన్ని సిద్ధం చేసింది. అందులోని వివరాల ప్రకారం.. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్‌దేనని నిర్ధారించారు. నిపుణుల కమిటీ- నివేదికను అప్పటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పక్కకు పెట్టారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదన్నది సహేతుక కారణం కాదు. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, డీపీఆర్ కంటే ముందే బ్యారేజీలకు సిద్ధం అయ్యారు. టెండర్లు, ఓ అండ్ ఎం డిజైన్, నాణ్యతలో లోపాలున్నాయి. బ్యారేజీల నిర్మాణానికి పూర్తి బాధ్యత అప్పటి సీఎం కేసీఆర్‌దే. జవాబుదారీతనం, పాలనాపరమైన విధానాలు పాటించలేదు. పాలనా విధానాలు అనుసరించకుండా హరీశ్‌రావు ఆదేశాలు ఇచ్చారు. ఆర్థిక జవాబుదారీ తనాన్ని అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పాటించలేదు. కాళేశ్వరం బోర్డులో అధికారులు ఉన్నా వారికి సంబంధం లేదని ఈటల చెప్పారు. ప్రణాళిక, నిర్మాణం, ఓ అండ్ ఎం, నీటినిల్వ, ఆర్థిక అంశాలకు అప్పటి సీఎందే బాధ్యని అన్నారు. కాళేశ్వరంలో ఆర్థిక అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన జరిగింది. ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థతో కుమ్మక్కయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైంది. బ్యారేజీలు దెబ్బతినడానికి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణం. నిర్మాణ స్థలం మార్పు, అంచనాల సవరింపులో అవకతవకలున్నాయి. డిజైన్ల లోపాలు, నాణ్యత తనిఖీలు లేకపోవడంతో నష్టం జరిగింది. ప్రజాధనం దుర్వినియోగానికి బోర్డు సభ్యులు కూడా బాధ్యులు. కాళేశ్వరం బోర్డులోని అధికారులపై క్రిమినల్ బీచ్ ఆఫ్ ట్రస్ట్ కింద చర్యలు తీసుకోవాలి. మేడిగడ్డ నిర్మాణంపై ఎల్ అండ్ టీ సంస్థకు ఎలాంటి సర్టిఫికెట్లు- ఇవ్వొద్దు. బ్యారేజీ ఏడో బ్లాక్‌ను ఆ సంస్థ పునరుద్ధరించాలి. ఇతర ఆనకట్టల్లో లోపాల సవరణ కూడా చేయాల్సిందే. ఈ వ్యయాన్ని ఎల్ అండ్ టీనే భరించాలని ఈ మేరకు నివేదిక సారాంశాన్ని అధికారుల కమిటీ వెల్లడించింది.

## మరోమారు ఎర్రవల్లలో చండీయాగం

### పూజాకార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం

**గజ్వేల్, ఆగస్ట్ 4 :** ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో చండీ యాగం రేపటి నుంచి ప్రారంభం కానుందని ప్రచారం సాగుతోంది. ఈ యాగాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. యాగం కోసం సోబవారం ప్రత్యేక పూజలు నిర్వహించారని చెబుతున్నారు. ఈ పూజా కార్యక్రమంలో కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ చండీ యాగం మూడు రోజుల పాటు- కొనసాగనుంది. మంగళవారం నుంచి అధికారికంగా యాగం ప్రారంభమవుతుందని అంటున్నారు. ఒకవైపు యాగం ఏర్పాట్లు- జరుగుతుండగానే, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే ప్రధానంగా చర్చలు జరిగినట్లు సమాచారం. యాగంతో పాటు రాజకీయపరమైన కీలక చర్చలు కూడా ఫామ్‌హౌస్‌లో కొనసాగాయిన, ప్రధానంగా కాళేశ్వరంపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారని తెలుస్తోంది.




## రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ పన్ను ఎగవేత

### కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 :** 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్‌టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు- ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది.

# అరెస్ట్ చేసిన భయపడేది లేదు

- కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని
- కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టాలి
- పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపు



**గజ్వేల్, ఆగస్ట్ 4 :** కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దామని పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించిన దేనని స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఈ ప్రాజెక్ట్‌లో చోటు- చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 15 నెలలపాటు ఈ కమిషన్ విచారణ జరిపింది. చివరకు జులై 31వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తన నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. ఆగస్టు 1వ తేదీన పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. ఈ కమిటీ- ఆదివారం సమావేశమై.. చర్చించింది. ఈ కమిటీ- అందించిన నివేదికపై తెలంగాణ సచివాలయంలో సోమవారం జరిగిన కేబినెట్ భేటీ-లో ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అదీకాక లక్షల కోట్ల రూపాయిలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. ఇంకా చెప్పాలంటే.. ఈ ప్రాజెక్ట్‌కు కర్మ, కర్త, క్రియ అంతా కేసీఆర్ అని చెప్పకనే చెప్పింది. ఇదిఆవుంటే కేసీఆర్ యాగం చేయనున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

## 50శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయకుండా అడ్డంకి

### బిజెపి తీరుపై మండిపడ్డ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్ 4 :** రిజర్వేషన్లపై యాభై శాతం క్యాప్ ను ఎత్తేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడిన ఆయన.. బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ బిల్లు గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపించామని.. కానీ కేంద్రం ప్రభుత్వం అడ్డుపడుతోందని అన్నారు. బీసీల పట్ల బీజేపీ పార్టీ కి ప్రేమ లేదన్నారు మహేష్ కుమార్ గౌడ్. మొదటి నుంచి బీసీ రిజర్వేషన్ల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాహాటంగానే వ్యతిరేకిస్తూన్నారని అన్నారు. ఎస్సి, ఎస్‌టి, బీసీ మైనార్టీల పట్ల ఎందుకు మీకు వివక్ష..? అని కిషన్ రెడ్డి ని సూటిగా ప్రశ్నిస్తున్నట్లు- చెప్పారు. ముస్లింలను సాకుగా చూపించి బీసీ బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ లో బీజేపీ ప్రభుత్వం ఉందని.. ఇక్కడ మెలిక పెడుతున్నవళ్లు అక్కడ ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని ఆరవతేదీన జంతర్ మంతర్ వద్ద ముఖ్యమంత్రితో సహా అందరూ ధర్నా చేస్తున్నట్లు- తెలిపారు. ఢిల్లీలో చేపట్టనున్న ధర్నా గురించి మాట్లాడిన పీసీసీ చీఫ్.. బీసీ రిజర్వేషన్ల బిల్లు సాధనకై పన్నెండు వందల మంది నాయకులు -ట్రైన్ ద్వారా ఢిల్లీ వెళుతున్నట్లు- తెలిపారు. వాకిటి శ్రీవారి , పొన్నం ప్రభాకర్, ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తో కలిసి చర్లపల్లి నుంచి నాయకుల తో ఆలేరు వరకు -ట్రైన్ లోజర్నీ చేసినట్లు- చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు యావత్ దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా మారిందన్నారు.



## కేవలం బిసిలకే 42శాతం రిజర్వేషన్లు

- 10శాతం ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించం
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్ట్ 4 :** కేవలం బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే భాజపా పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఇందులో ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించబోమని అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో చేసినట్లే దిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తామని చెప్పలేదు. బీసీలకే 42 శాతం అమలు చేస్తామంటే పూర్తి మద్దతిస్తాం. ముస్లింలకు 10 శాతం ఇస్తే.. 10 శాతం బీసీలకు అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లను భాజపా అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్‌ను బీసీలు నమ్మరని అన్నారు. బిసిల పేరు చెప్పి ముస్లింలకు ఇచ్చే కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ఉద్దేశం లేదని రామచందర్‌రావు అన్నారు. ముస్లింలకు 10 శాతం ఇస్తే, పదిశాతం బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే పాత రిజర్వేషన్లే కొనసాగించాలనేది ఉద్దేశం అని రామచందర్ రావు పేర్కొన్నారు.

# జాగృతి కవిత ఎవరో తెలియదు

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- నల్లగొండలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం
- ఇందిరాభవన్‌గా నామకరణం
- ఫోన్ చేసి అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి




**నల్లగొండ, ఆగస్ట్ 4 :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎవరో తనకు తెలియదు అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత బీసీ ధర్నా జోక్ అని ఎద్దేవా చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాడుతాం అని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం చేస్తా అని కవిత తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. 'క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో మొదటి ఏడాది నేను బాధపడ్డాను. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా ఉంది. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమానమే. నల్లగొండ జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్ట్ లను ఏడాదిలో పూర్తి చేస్తాం' అని మంత్రి చెప్పారు. కేబినెట్‌లో జరగబోయే చర్చపై నేను ముందుగా మాట్లాడను. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ నిందితులు జైలుకు వెళ్తారు. నా ఫోన్ ట్యాప్ కాలేదు. ఏపి తలపెట్టిన బనకచర్ల కట్టనివ్వం. కాళేశ్వరం నివేదికపై కేబినెట్‌లో సమగ్రంగా చర్చిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని అందరికీ తెలుసు, ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నాం. కవిత ఎవరో నాకు తెలియదు. కవిత బీసీ ధర్నా జోక్. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాడుతాం. ఆర్డినెన్సును సాధిస్తాం. నారా లోకేష్‌కు రాజకీయ అవగాహన లేదు. భనకచర్లపై అవసరమైతే కేంద్రంపై కొట్లాడుతాం. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకుంటాం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేడు నల్లగొండ జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఆపై యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను, భూమి పూజకు సంబంధించిన వివరాలను సీఎంకు మంత్రి వివరించారు. స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ, క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కందూరు జైవీర్ రెడ్డి హాజరయ్యారు.



## స్కూటీని ఢీకొన్న లారీ

### ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

**పార్వతీపురం, ఆగస్ట్ 4 :** ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి, ఓవర్ స్పీడ్, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలు వందలాది కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు విద్యార్థులు ప్రయాణిస్తున్న స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు గిరిజన విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులు కొరిసిల గ్రామానికి చెందిన కార్తీక్, ఉదయ్, జగన్ గా గుర్తించారు. మృతుల్లో ఒకే కుంటుంబానికి చెందిన ఇద్దరు అన్న దమ్ములు ఉన్నారు. ఉదయ్ కిరణ్ ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, కార్తీక్ పాలిటెక్నిక్, జగన్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు.

# చట్టాలు కాలరాచి.. నీతివాక్యాలు?



బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ మారడంపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పెద్దగా సంచలనం కలిగించ లేదు. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీం ధర్మాసనం తీర్పు ఇచ్చినా పెద్దగా చర్చ సాగలేదు. ఎమ్మెల్యేలపై అనర్హతవేటు పడుతుందని బిఆర్ఎస్ ఆశపడింది. కానీ అలా జరగలేదు. అయితే ఈ విషయంలో ఎవరికి వారు తీర్పుపై తమకు అనుకూలంగా భాష్యాలు చెప్పుకున్నారు. నిజానికి చట్టాలను ఉల్లంఘిస్తున్న వారు చట్టాలను అమలు చేయాలని కోరడమే పెద్ద తప్పు. ఎన్నో చట్టాలను చట్టుబండలు చేసిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేల విషయంలో మాత్రమే వారిని అనర్హులను చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చింది. ఎందుకంటే వారు అధికారంలో ఉండగా గంపగుత్తగా టిడిపి, సిపిఐ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న విషయం ప్రజలు మరచిపోలేదు. వారిని ఎలా చేర్చుకున్నా తప్పే. ఎందుకంటే రాజకీయంగా నిజాయితీగా లేరని ఈ విషయం స్పష్టం చేసింది. దీనికి వక్రభాష్యాలు చెప్పడం బిఆర్ఎస్ నేతలు మానుకోవాలి. గొర్రెల స్కామ్‌లో వేయికోట్లు, కాళేశ్వరంలో లక్షకోట్లు, రైతుబంధులో వేలకోట్లు, ఈ ఫార్ములా రేసులో కొన్నికోట్లు ఇలా దోచుకుని చట్టాలను చట్టుబండలు చేసి, ప్రజాధనాన్ని దోచుకున్న వారికి ఫలాన చట్టం అమలు చేయాలని కోరడం లేదా డిమాండ్ చేయడం సరికాదు. అలాంటి అర్హత వారికి ఎప్పటికీ లేదు. అందుకే సుప్రీం తీర్పు వచ్చినా ప్రజల్లో ఎక్కడా పెద్దగా స్పందన కానరావడం లేదు. ఇక సుప్రీం తీర్పు అమలు చేయాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వం గురించి ఓ విషయం చెప్పుకోవాలి. హైదరాబాద్‌లో ఉమ్మడి ఎపిలో వైఎస్ సిఎంగా ఉన్న సమయంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చారు. దీనిపై కోర్టులో నలిగి చివరకు సుప్రీం కోర్టు జర్నలిస్టులకు స్థలం అప్పగించాలని ఆదేశించింది. సుప్రీం చీఫ్ జస్టిస్ ఇచ్చిన ఆదేశాన్ని కూడా ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆనాడు సుప్రీం తీర్పును పట్టించుకోని, అమలు చేయని పాలకులు బిఆర్ఎస్ నేతలు. తీర్పులను పట్టించుకోని వీరు పాలనకు అనర్హులు.

చట్టాలను ఉల్లంఘించడం, వాటిని అమలు చేయకపోవడం, పూర్తిగా అవినీతిలో కూరుకు పోవడం,కుటుంబ సభ్యులకే పదవులు కట్టబెట్టుకోవడం వంటి అనేక అరచకాలకు పాల్పడ్డవారు పాలకలుగా అనర్హులు. అలాంటి వారు సుప్రీం తీర్పు అమలుచేయాలని కోరడంలో అర్హత లేదు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వస్తే గెలుపు తమదే అన్న ధీమాతో బిఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించి ఉంటుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సహజంగానే ఉప ఎన్నికలు వస్తే ఇబ్బంది ఉంటుంది. అందుకే ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి పార్టీ ఫిరాయిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం లేకపోతే ఎమ్మెల్యేలు గెలిచిన పార్టీలో కాకుండా అధికారంలో ఉన్న పార్టీలో ఉంటారు.బిఆర్ఎస్ నుంచి ఏడాది క్రితమే మరో పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టేవారు. ఇప్పటకే ఓ 20 మంది గోడదూకేవారు.ఈ నేపథ్యంలో ఎన్నికైన సభ్యులు చేజారి పోకుండా కాపాడు కోవడంతో పాటు, పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని పార్టీ శ్రేణుల్లో నమ్మకం కల్పించేం దుకు బీఆర్ఎస్ నానా తంటాలు పడుతోంది. అందుకే ఉప ఎన్నికలు రావాలని కోరుకుంటోంది. ఈ కారణంగానే మూడు నెలల తర్వాత ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. నిజానికి ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నడుచుకొనేవారు. వారి నిర్ణయాలు పార్టీలకు అతీతంగా చట్టబద్దంగా ఉండేవి. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అనుగుణంగా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇలాగే వ్యవహరించారు. పార్టీ ఆదేశాల మేరకు నడుచుకున్నారు.

ఆనాడు లేని నిబంధనల గురించి ఇవాల బిఆర్ఎస్ వాదిస్తోంది. నిజానికి సభలో అసలు చర్చకే ప్రాధాన్యం లేకుండా పోయింది. కేవలం ఇప్పుడే మళ్లీ అసెంబ్లీలో చర్చలు సాగుతున్నాయి. స్పీకర్లు సరైన నిర్ణయం తీసుకోక పోవడం వల్లనే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొవాలని సుప్రీం గడప తొక్కుతున్నారు. సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు సత్వరం పరిస్కారం కావడం లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించింది. ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు-న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడం సరికాదు. ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం కాకుండా సత్వర చర్యలు తీసుకోవాలి. పాలకులుగా ఏ పార్టీ వారు ఉన్నా చట్టాలు సక్రమంగా అమలు కావాలి. అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికి స్పీకర్లు ప్రాధాన్యం ఇస్తున్నందున సమస్యలు వస్తున్నాయి. సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరఫున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక,ముఖ్యమంత్రి అయిన కెసిఆర్ కూడా కాంగ్రెస్-తెలుగుదేశం -కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున భయంతో వీరిని చేర్చుకున్నారు. అయినా ఆనాడు తప్పని వాదించిన కెసిఆర్ తరవాత అదే పద్దతిలో వెళ్లడం ముమ్మాటికీ తప్పుగానే భావించాలి. రెండోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉన్నా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చిన కేసీఆర్ చర్యను అంతా ఆక్షేపించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకున్న బిఆర్ఎస్‌కు ఇవాళ కాంగ్రెస్ చర్యలు వ్యతిరేకించడం సరికాదు. అందువల్ల స్పీకర్లు చట్టబద్దంగా వ్యవహరించాలి. పాలకులు చట్టబద్దంగా నడుచుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడు తుంది.

# భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తా

## ఆక్రోశం వెళ్లగక్కిన ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇటీవల భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. తాజాగా మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపిం చారు. భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యాకు భారీగా ఆర్థిక వనరులు చేకూరుతున్నాయని, అందుకే ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. "రష్యాతో యుద్ధం వల్ల ఉక్రెయిన్‌లో ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో వాళ్లకు అవసరం లేదు. అందుకే భారత్‌పై సుంకాలను మరింత పెంచబోతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌పై విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే.

# కాళేశ్వరం అప్పులపై వడ్డీ తగ్గించే అంశం

- ప్రాజెక్టు పూర్తి చేస్తే పరిశీలిస్తామన్న కేంద్రం
- లోక్‌సభలో ఎంపి చామల ప్రశ్నకు సమాధానం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 :** కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తే అప్పులపై వడ్డీ తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రుణాల చెల్లింపు, రీ షెడ్యూల్ మార్పు చేస్తే ఆర్బీఐ నిబంధనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి సబ్ స్టాండర్డ్‌కు డౌన్ గ్రేడ్ అవుతుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయి. ప్రాజెక్టు స్పెషల్ పర్పస్ వెహికల్‌కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ రుణాలు ఇచ్చాయి. పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ లాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు.. వివిధ మార్గాల్లో నిధులను సేకరిస్తాయి. వాటికయ్యే ఖర్చుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయిస్తారు. ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్‌ఈసీ పొడిగించింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపును పరిశీలిస్తాం అని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొం ది. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల రిస్ట్రక్చర్‌కు తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయని కేంద్రమంత్రి పంకజ్ చౌదరి గుర్తుచేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్‌ఈసీ పొడిగించిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు.

# రఘురామపై కానిస్టేబుల్ కేసు

- ఇక దీనిని కొనసాగించలేననని సుప్రీంకు వివరణ
- అఫిడవిట్ సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజుపై పెట్టిన కేసును ఇక కొనసాగించలేనని సుప్రీంకోర్టుకు ఫిర్యాదుదారు కానిస్టే బుల్ ఫరూక్‌భాష తెలిపారు. 2022 జూన్‌లో రఘురామ, ఆయన కొడుకు భరత్‌పై ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఫరూక్‌భాష కేసు పెట్టారు. రఘురామ ఇంటి వద్ద అనుమానాస్ప దంగా తిరుగుతున్న వ్యక్తిని సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి రఘురామ, ఆయన భద్రతా సిబ్బంది ఫిర్యాదు చేశారు. డ్యూటీలో ఉన్న తనపై దాడికి పాల్పడ్డారని రఘురామ, ఆయన కొడుకు భరత్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై అదే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఫరూక్‌భాష ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ ఫరూక్‌భాష ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీసులు తమ ఫిర్యాదును పట్టించుకో కుండా... తమపైనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడాన్ని హైకోర్టులో సవాలు చేశారు రఘురామ. హైకోర్టు తిరస్క రించడంతో సుప్రీంకోర్టును రఘురా మ ఆశ్రయించారు. రఘురామ పిటిషన్‌పై జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఎంపీగా వై క్యాటగిరిలో సీఆర్‌పీఎఫ్ భద్రత ఉన్న సమయంలో అనేక ఘటనలు జరిగా యని రఘురామ తరపు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చా రు. అనుమానాస్పదంగా తిరుగు తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పజెప్పి... ఫిర్యాదు చేస్తే పోలీసులు తమపైనే ఎదురు కేసు పెట్టారని రఘురామ న్యాయవాది వివరించారు. వరుస ఘటనలకు సంబంధించిన వివరాలు కోర్టుకు అందించాలని రఘురామ న్యాయవాదిని ఆదేశించింది సుప్రీంకోర్టు ధర్మాసనం. అదే సమయంలో ఫిర్యాదు దారు కానిస్టేబుల్ ఫరూక్‌భాష తరపు న్యాయవాది జోక్యం చేసుకున్నారు. ఇకపై ఈ కేసును కొనసాగించేందుకు సిద్దంగా ఆయన లేరని తనకు సమాచారం పంపినట్లు- ఫరూక్‌భాష న్యాయవాది తెలిపారు. అందుకు అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను రెండు వారాలు సుప్రీం కోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.

# తిరుమల భద్రతకు టిటిడి పెద్దపీట

- ఆధార్ వివరాలు తీసుకోమంటే విమర్శలా
- భూమన వ్యాఖ్యలపై మండిపడ్డ భాను ప్రకాశ్



**తిరుమల, ఆగస్ట్ 4 :** టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి స్పందించారు. తిరుమలలో ఏదో జరిగిపోతుందని భూమన కరుణాకర్ రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం తిరుమలలో భానుప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తిరుమలలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల హెచ్చరికలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. మూడంచెల భద్రతలో భాగంగా శ్రీవారి ఆలయం, భక్తులకు టీటీడీ భద్రత కల్పిస్తోందని భానుప్రకాష్ రెడ్డి ఉద్ఘాటించారు. భక్తుల భద్రత కోసమే మఠాలకు నోటీసులు ఇచ్చామని భానుప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. స్వామి వారికి నిత్య కైంకర్యాలు చేస్తున్న మఠాలు, పీఠాధిపతులంటే టీటీడీకి చాలా గౌరవం ఉందని ఉద్ఘాటించారు. మఠాల్లోనూ భక్తుల ఆధార్ వివరాలు తీసుకొని వసతులు కల్పించాలని నోటీసులు ఇచ్చామని గుర్తుచేశారు. తిరుమలలో భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు- చేయాలని సూచించామని పేర్కొన్నారు. వివరాలు తీసుకోవాలంటే.. హిందూధర్మం, మఠాలపై దాడి అని భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడతారా.. అని ప్రశ్నించారు. తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చింది వైసీపీయేనని భానుప్రకాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఏఐ టెక్నాలజీని వినియోగించి భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించడం సాధ్యం కాదంటూ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఖండించారు. టె-క్నాలజీపై అవగాహన లేకుండా ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించే అంశంపై అధ్యయనం చేసేందుకు గూగుల్, టీసీఎస్ సంస్థలు ముందుకు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ సంస్థలు టీటీడీకి ఉచితంగా సేవలు అందిస్తున్నాయని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. దాతల సహాయంతో చేస్తున్న పనిని కూడా వృథా అనడాన్ని ఎల్వీ సుబ్రహ్మణ్యం విజ్ఞతికే వదిలేస్తున్నానని హితవు పలికారు. శ్రీవారి దర్శనం కోసం భక్తులు రోజుల తరబడి క్యూ లైనల్లో పడిగాపులు ఉండటం మంచిదా..? అని ప్రశ్నించారు. ప్రపంచం మొత్తం ఏఐ టెక్నాలజీని వినియోగస్తోందని గుర్తు చేశారు. భక్తుల ఇబ్బందులు తొలగించడానికే ఏఐ టెక్నాలజీని వినియోగించాలని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని..ఇందులో ఎలాంటి తప్పు లేదని నాయుడు పేర్కొన్నారు.

# దొంగతనం చేసిన ఇంట్లోనే నిద్రించి..

**మధ్యప్రదేశ్ :** సాధారణంగా దొంగలు వీలైనంత తొందరగా గుట్టుచప్పుడు కాకుండా తమ పని కానిచ్చేసి అక్కడి నుంచి పారిపోతారు. కానీ, ఓ దొంగ మాత్రం మద్యం మత్తులో దొంగతనం చేసిన ఇంట్లోనే నిద్రపోయాడు. తెల్లవారు జామున ఇంటి యజమానికి చిక్కి చివరకు కటకటాలపాలయ్యాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని నజీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మద్యానికి బానిసైన ఓ దొంగ పూటుగా తాగి.. మర్యంపూర్ రైల్వే లైన్‌లోని పక్కపక్కనే ఉన్న ఇద్దరు అన్నదమ్ముల ఇళ్లలోకి అర్ధరాత్రి వేళ చొరబడ్డాడు. తొలుత వినోద్ కుమార్ ఇంటి కిటికీలను బద్దలు కొట్టి..లోపలికి వెళ్లాడు. లాకర్ ని తెరిచి విలువైన వస్తువులను కాజేశాడు. అక్కడితో ఆగకుండా రెండిళ్లకూ మధ్యన ఉన్న తలుపును విరగ్గొట్టి.. అనిల్ కుమార్ ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువా తెరిచి.. బంగారు నగలను అపహరించాడు. అయితే, అప్పటికే అలసిపోయిన నిందితుడు.. తాగిన మైకంలో అక్కడే నిద్రపోయా డు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న అనిల్.. వేకువజామున ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో నిద్రిస్తుండటం చూసి షాక్ అయ్యాడు. అప్రమత్తమై ఇళ్లంతా వెతకగా బంగారం, విలువైన వస్తువులు మాయమైనట్లు గుర్తించాడు. నిద్రపోతున్న వ్యక్తి దగ్గరికి వెళ్లి చూడగా.. దొంగతనానికి గురైన నగలు, నగదు అక్కడే ఉన్నాయి. ఆ గందరగోళానికి అనిల్ భార్య బాబ్లీ కూడా మేల్కొని, తన నగలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఆగ్రహించిన స్థానికులు దొంగకు దేహశుద్ధి చేసి చివరకు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ట్రంప్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన భారత విదేశాంగ శాఖ

**ఢిల్లీ:** భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తామన్న అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. 'రష్యా నుంచి చమురు కొంటున్నందుకే భారత్‌ను అమెరికా, ఈయూ లక్ష్యంగా చేసుకున్నాయి. రష్యా నుంచి ఈయూ అనేక వస్తువుల ను దిగుమతి చేసుకుంటుంది. యురేనియం, పల్లాడియంను రష్యా నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటుంది. భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న దేశాలే రష్యా నుంచి దిగుమతులు చేసుకుం టున్నాయి. ఆ దేశాలు దిగుమతులు కొనసాగిస్తూ భారత్‌ను విమ ర్శించడం అన్యాయం. దేశ ప్రయోజనాలు, ఆర్థిక భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది.



## శిబూసోరెన్ కన్నుమూత

**ఢిల్లీ:** ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ (81) కన్నుమూశారు. మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "మన ప్రియనేత దిషోమ్ గురూజీ మనల్ని విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది" అని ఉద్వేగ పూరితంగా రాసుకొచ్చారు. ప్రస్తుతం బిహార్‌లో భాగమైన రామ్‌గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయన సతీమణి పేరు రూపీ సోరెన్. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. 2009లో దుర్గా సోరెన్ మృతి చెందారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. సంతాల్ కమ్యూనిటీకి చెందిన శిబు సోరెన్... వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోతో కలిసి 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చాను ఏర్పాటు చేశారు. తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో కీలక నేతగా ఎదిగారు. ఆ పోరాట ఫలితంగా 2000లో ఝార్ఖండ్ రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి సీఎం అయ్యారు. ఆయన మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా.. అక్కడా అదే పరిస్థితి. 1974 నాటి కేసు కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తన మాజీ కార్యదర్శి హత్య కేసులో దోషిగా తేలడంతో మరోసారి కేంద్రమంత్రి పదవిని కోల్పోయారు. ఒక హత్యకేసులో కేంద్రమంత్రి దోషిగా తేలడం అదే తొలిసారి. అయితే ఢిల్లీ హైకోర్టు తర్వాత ఆయన్ను నిర్దోషిగా తేల్చింది. శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ, రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు. "శిబూసోరెన్‌జీ అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగారు. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం కోసం కృషి చేశారు. ఆయన మరణం బాధాకరం. ఇప్పుడు ఆయన కుటుంబం, అభిమానుల గురించే నా ఆలోచనంతా. ఇప్ప టికే హేమంత్ సోరెన్‌జీతో మాట్లాడాను. ఓం శాంతి" అని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# అత్తింటి వేధింపులు..

## నవ వధువు అనుమానాస్పద మృతి



**కృష్ణా :** పెళ్లయిన ఐదు నెలలకే అనుమానాస్పద రీతిలో నవ వధువు మృతి చెందిన ఘటన కృష్ణా జిల్లా ఉయ్యూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మొవ్వ మండలం కొండవరం గ్రామానికి చెందిన నాగరాజు, శివనందేశ్వరమ్మల కుమార్తె శ్రీవిద్య ఎమ్మెస్సీ పూర్తి చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 23న కంకిపాడు మండలం కుందేరుకు చెందిన అరుణ్‌కుమార్‌తో ఆమెకు వివాహమైంది. అరుణ్ ఉయ్యూరు మండలం కలవపాములలో సర్వేయర్‌గా ఉద్యోగం చేస్తుండ గా.. శ్రీవిద్య ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోం ది. పెళ్లయిన నాటి నుంచి శ్రీవిద్యకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆమె ఆదివారం మృతి చెందింది. భర్త తరచూ దాడి చేసి వేధిస్తున్నాడని.. భరించలేక పోతున్నానంటూ తండ్రికి శ్రీవిద్య లేఖ రాసినట్లు తెలుస్తోంది. తనను వేధించిన భర్త, అత్తమామల్ని వదలొద్దని సూసైడ్ నోట్‌లో శ్రీవిద్య పేర్కొన్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి పన్నెండున్నర గంటల సమయంలో తమను వెంటనే రమ్మని ఫోన్ వచ్చిందని, తమ కుమార్తె ఇంటికి వెళ్లే సరికి శవమై కనిపించిందని మృతురాలి తల్లిదండ్రులు బోరున విలపించారు. అల్లుడే తన కుమార్తెను చంపి ఉంటాడని తండ్రి నాగరాజు ఆరోపిస్తున్నారు. ఉయ్యూరులోని తమ ఇంటిని అమ్మేసి డబ్బులివ్వాలని తన కుమార్తెను పెళ్లయిన రోజు నుంచే వేధిస్తున్నాడని, అప్పటికే రూ.10లక్షల కట్నం, రూ.10లక్షలు విలువైన బంగారం ఇచ్చినట్లు తెలిపారు. నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాటి చెట్టు పైనుంచి జారిపడి
# గీత కార్మికుని మృతి



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** తాటి చెట్టు పైనుండి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన వట్టిపల్లి సుధాకర్ (55) తన రోజువారి వృత్తిలో భాగంగా తాటి చెట్టు పైకి ఎక్కి కళ్ళు తీసే క్రమంలో జారి కిందపడి మృతి చెందాడు. ఇట్టి విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై యుగేందర్ గౌడ్ తెలిపారు.



## పండుగ సాయన్న జయంతిని
# అధికారికంగా నిర్వహించాలి

**తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పిట్టల అశోక్ ముదిరాజ్**

**బీబీనగర్, రాజముద్ర న్యూస్ :** ఈనెల 8న పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని ముదిరాజ్ సంఘం మండల శాఖ తరపున బీబీనగర్ లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిట్టల అశోక్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా పోరాటం సాధించిన బహుజన వీరుడు పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సందర్భం గా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పండుగ సాయన్న కేవలం భౌతిక దోపిడీకి వ్యతిరేకంగా మాత్రమే కాదు, సామాజిక న్యాయం కోసం, రాజ్యాధికారంలో బీసీలకు న్యాయమైన వాటా కోసం పోరాటం సాగించారని ఆయన అన్నారు. సాయన్న వారసత్వాన్ని కేవలం జయంతి నాడు గౌరవించడంలో కాదు ం ఆయన కలల తెలంగాణలో నిజం చేసే దిశగా బీసీలు, బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఆయన అన్నారు. బీసీలు తమ సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం సంఘటితమవాలని, రాజకీయ తలంపులకోసం కాకుండా, సామాజిక న్యాయ సాధన కోసం పండుగ సాయన్న జయంతిని ఈనెల 8 వ తేదీన గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కనకపోయిన గోపాల్ ముదిరాజ్, కొర్ని పాండు ముదిరాజ్, ఆరుముల్లా జహంగీర్ ముదిరాజ్, బోయిన కృష్ణ ముదిరాజ్, సార నరసింహ ముదిరాజ్, గుండెగాల్ల అశోక్ ముదిరాజ్,ఎర్రోళ్ల బాలరాజు ముదిరాజ్ పాల్గొన్నారు.



## శ్రీహన్వికను ఆశీర్వదించినా
## కేచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి

**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్ :** ఆత్మకూరు (ఎం) మండలం పట్టణ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు కోరే వెంకన్న మనువరాలు శ్రీ హన్విక ను ఆశీర్వదించినా కేఎచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కోరే భిక్షపతి,యాస కవిత ఇంద్రారెడ్డి, గడ్డం దశరథ,లాగ్గాని రమేష్, సత్యనారాయణ, యాదగిరి, అబ్బసాయిలు, అజీమోద్దీన్, నవీన్ పాల్గొన్నారు.



## పోలీసు శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ
# అండగా ఉంటుంది : ఎస్పి నరసింహ

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** గట్టికల్లు గ్రామంలో తల్లి లక్ష్మి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో 15 రోజుల క్రితం తండ్రి రాములు రోడ్డు ప్రమాదంలో మరణించగా ఒంటరిగా మిగిలిన ఇద్దరు పిల్లలు.పిల్లలకు అండగా నిలిచిన సూర్యాపేట జిల్లా పోలీస్. పిల్లల గృహాన్ని సందర్శించి పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో బాగంగా పిల్లలకు నిత్యావసరాలు,పాఠ్య పుస్తకాలు, నగదు ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారినపడి పిల్లలను, కుటుంబాలను ఒంటరి వాళ్ళను చేయొద్దు అని కోరారు.ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసు శాఖ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు.పిల్లల యొక్క పరిస్తిని గమనించి స్నేహపూర్వక పోలీసు,పోలీసు ప్రజా భరోసా ద్వారా పోలీసు శాఖ తరపున సహకారం అందించాలని ఈరోజు గట్టికల్లు గ్రామానికి వచ్చామని అన్నారు.ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కుటుంబ పెద్దను,తల్లిదండ్రులను కోల్పోయి పిల్లలు ఈ పరిస్థితికి రావడం బాధాకరం అన్నారు. పిల్లలతో మాట్లాడుతూ బాగా చదివి పెద్ద ఆఫీస్ కావాలని ఆకాక్షించారు.పోలీసు శాఖ అనగానే సమాజంలో ఒక రకమైన భావన ఉండేది, ప్రస్తుతం పోలీసులు స్నేహపూర్వక పోలీసింగ్ తో ప్రజలకు చేరువైనారు.పోలీసు అనగానే కేసులు, కోర్టులు అనే భావన వీడాలి ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు అండగా ఉంటున్నాము,పోలీసులు మనకోసం ఉన్నారు మనవారు అనే సద్భావన కలిగాలి అని కోరారు. ఈ కార్యక్రమం నందు సూర్యాపేట రూరల్ సి ఐ రాజశేఖర్,ఆత్మకూరు ఎస్ ఐ శ్రీకాంత్,జిల్లా పోలీసు వెల్ఫర్ ఆర్ ఎస్ ఐ సాయిరాం,ఆర్ ఎస్ ఐ సురేష్,స్థానిక ప్రజలు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను
# త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, ఇంకా నిర్మాణం ప్రారంభించని ఇండ్లు ఎన్ని ఉన్నాయని,ఎంపి డి ఓ ని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు నిర్మాణాపు పనులు పూర్తి అయినంత వరకు లబ్ధిదారులకు వాళ్ళ అకౌంట్ లలో డబ్బులు జమ అయ్యాయా అని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకుసిమెంట్,ఇటుక, స్టీల్ తక్కువ ధరకు మాట్లాడి ఇప్పిస్తున్నారా అని, తక్కువ ధరకే ఇప్పించాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రతి సోమవారం బేస్మెంట్ లెవెల్ పూర్తయిన లబ్ధిదారులకు లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలంధర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ కిరణ్, ఏపీఎం అంజయ్య, ఏపీఓ పరశురాం మాజీ ఎంపిటిసి బెలిదే నాగేశ్వర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో బోనాల
# మహోత్సవాన్ని జరుపుకోవాలి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్రిష్ణా టాకీస్ సమీపంలోని శ్రీశ్రీశ్రీ ఊర ముత్యాలమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాన్న భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పట్టణ సీఐ వెంకటయ్య,మున్సిపల్ కమీషనర్ సిహెచ్.హన్మంతరెడ్డిలు అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఈ నెల 10న బోనాల పండుగ జరగనున్న ఊర ముత్యాలమ్మ ఆలయం, 17న బోనాలు జరగనున్న ఇంద్రవెల్లి ముత్యాలమ్మ ఆలయాలను ఆయన సందర్శించి మున్సిపల్, పోలీసు అధికారులతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని నలు మూలల నుంచి 50వేల మంది వరకు భక్తులు బోనాలు సమర్పించేందుకు రానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల రద్దీని నివారించేందుకు ఆలయం వెలుపల, బయట బారీ కేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేందుకు ఆలయ కమిటీలు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిన ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు. శ్రీశ్రీశ్రీ ఊర ముత్యాలమ్మ అమ్మవారికి ఎస్సీ కమ్యూనిటీ ప్రజలు 12గంటల వరకే బోనాలు సమర్పించాల్సిందిగా ఆలయ కమిటీ అధ్యక్షులు వల్దాస్ శ్రీను తెలిపారు. అనంతరం తాళ్లగడ్డలోని ఇంద్రవెల్లి ముత్యాలమ్మ ఆలయంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సహకారంతో రూ12 లక్షల వ్యయంతో ఆలయ ఆవరణ సీసీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ ఊర ముత్యాలమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు సారగండ్ల రాములు, శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మున్సిపల్ డిఇ సత్యారావు,పట్టణ ఎస్ఐ ఏడుకొండలు,ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజద్ అలీ,గుంటి సైదులు, కోల నాగరాజు,యాట వెంకన్న, లక్ష్మణ్,ఇండ్ల వెంకటలక్ష్మమ్మ, ఆకుల లవకుశ, వల్దాస్ ఈదయ్య, పరుశరాములు, పిడమర్తి శంకర్, జానపాటి నాగయ్య,పిడమర్తి ప్రసాద్, పిడమర్తి నర్సింంగరావు, గ్యార, విజయ్, పాలడుగు రవి, పిడమర్తి మహేందర్,దైద ఈశ్వర్,మేడి గోపిక్రిష్ణ వల్లాస్ సుధీర్,పిడమర్తి ఉపేందర్, దర్శిన శివ, చిట్టిపాక ప్రసాద్,పిడమర్తి మధు, సిరివెళ్ల శబరి,రాపర్తి శ్రీనివాస్,అనంతుల యాదగిరి,బొడ్డు సాయి,కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సామాన్యులకు పోలీసులు ఎప్పుడు మిత్రులే

- **మోసాలు, నేరాలు చేసే వారిపట్ల మాత్రమే కఠినంగా ఉంటాం**
- **సూర్యాపేట ఎస్పి నరసింహ**

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న ఫోన్స్ ను జిల్లా పోలీసులు పటిష్టంగా పని చేసి 101 ఫోన్స్ ను స్వాధీనం చేసుకున్నారు, దీనిలో భాగంగా సోమవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 101 ఫోన్ల ను జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ చేతుల మీదుగా బాధితులకు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ శరీరంలో బాగమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం,ఆన్లైన్ విద్య కోసం, జ్ఞాపకాలు పదిలం చేసుకోవడం కోసం,బ్యాంక్ అకౌంట్ నిర్వహణకోసం,సోషల్ మీడియా కోసం వినియోగిస్తున్నాం అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది కావున మొబైల్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పీ సూచించారు.ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సెయిర్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలి,మొబైల్ ను బ్లాక్ చేసి,మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ మోసాలు, గంజాయి వల్ల జరిగే అనర్థాలు, అసంఘిక కార్యకలాపాల గురించి వివరించి ఇక్కడ ఉన్నవారు మీ చుట్టూ ఉన్న వ్యక్తులకు అవగాహన కల్పించాలి అని కోరారు.పోలీసులు ప్రజల రక్షణకోసం ఉన్నార్,పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి, సమస్యలపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల రక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు,సామాన్యులకు పోలీసులు మిత్రులు, నేరాలకు పాల్పడేవారు పట్ల కఠినంగా వ్యవహరిస్తాం అన్నారు. జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను సెయిర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఇతర రాష్ట్రాల నుండి ఫోన్స్ రికవరీ చేయడం జరిగినది అన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,ఐ టి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది,పోలీస్ స్టేషన్ సిబ్బంది మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

- **ఎనిమిది మందికి జరిమానా**
- **సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం**

**సూర్యాపేట, రాజ ముద్ర న్యూస్ :** మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ,ఐపిఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ తొమ్మిది మంది పట్టుబడినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు.పట్టుబడిన వారిని 04-08-2025 నాడు కోర్టులో హాజరు పరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒక్కరికి ఒక్క రోజు జైలు శిక్ష మరియు 2,000జరిమానా అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా ఎనిమిది మందికి కలిపి 6,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.






## కేఎచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**శిబిరాన్ని ప్రారంభించిన కొప్పుల హరిదీప్ రెడ్డి**

**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్ :** ఆత్మకూరు (ఎం) మండలం పారుపల్లి గ్రామంలో కేఎచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ వారి అనుబంధంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కేఎచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి, గ్రామస్తులకు వైద్య సేవలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య సేవలో షుగర్ వ్యాధి సమస్యలు, దీర్ఘ కాలిక సమస్యలు, గుండె సమస్యలు, థైరాయిడ్ సమస్యలు, కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు, తల నొప్పిమైగ్రేన్, పక్షవాతము, ఫిట్స్, శ్వాససమస్యలు, కడుపునొప్పి, జ్వరం, మలేరియా జ్వరం, డెంగ్యూ జ్వరం, టీబీ వ్యాధి, వెన్ను నొప్పి వట్టి వ్యాధులకు ఉచితంగా సేవలు అందిస్తున్నమని ప్రతీ ఒక్కరి ఆరోగ్యమే ముఖ్యమని ఈ లాంటి సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కోరే భిక్షపతి, యాస కవిత ఇంద్రారెడ్డి, లాగ్గాని రమేష్, గడ్డం దశరథ, యాదగిరి, పల్లెర్ల సత్యనారాయణ,రంగయ్య,రామ్ రెడ్డి, లక్ష్మీనారాయణ, సోమరాజు కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, నర్సయ్య, ఉప్పలయ్య, వెంకటయ్య, మల్లారెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కురుమల సంక్షేమం కోసం
# కలిసి కట్టుగా పనిచేద్దాం

**కురుమ సంఘం మండల అధ్యక్షుడు బండమీది వెంకటయ్య**

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** కురుమల సంక్షేమం కోసం కురుమ నాయకులమంతా కలిసికట్టుగా పని చేయాలని శంకర్ పల్లి మండల కురుమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటయ్య, ఉపాధ్యక్షుడు మోత్కుపల్లి అశోక్ అన్నారు. సోమవారం రోజు మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో నూతన కురుమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బొంగు మల్లేష్, ఉపాధ్యక్షుడిగా సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, కార్యదర్శిగా మహేందర్, క్యాషియర్ శ్రీకాంత్, సలహాదారుడిగా మల్లేష్, యాదయ్య, రామచందర్, అయిలయ్య, రవీందర్, శివకుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## కల్వర్టు నిర్మించి ప్రజల సమస్యను పరిష్కరిస్తా

**మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** జిల్లా కేంద్రంలో తాళ్లగడ్డలో 27వ వార్డు లో పెద్ద మురికి కాలువను కలిపేలా పెద్ద మురికి కాలువపై కల్వర్టును నిర్మించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి అన్నారు.ఆ కాలనీలో ప్రజలు,ఆయా వార్డుల కౌన్సిలర్ల కోరిక మేరకు సోమవారం పట్టణంలోని తాళ్లగడ్డలో పెద్ద మురికి కాలువను మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తో కలసి ఆయన పరిశీలించారు. ఈ కాల్వపై కల్వర్టు నిర్మాణంతో రెండు మూడు కాలనీలకు రహదారి ఏర్పాటు అవుతుందన్నారు. ప్రస్తుతం కాలువ దాటి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై అధికారులు తగిన ఎస్టిమేషన్ వేసి కల్వర్ట నిర్మాణానికి పరిణాళికలు సిద్ధం చేయాల్సిందిగా కోరారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ఎస్టిమేషన్ వేయించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజద్ అలీ,ఆయా వార్డుల మాజీ కౌన్సిలర్లు సిరివెళ్ల శబరి, అనంతుల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్,నాయకులు కెక్కిరేణి శ్రీనివాస్,బొడ్డు సాయి,రాపర్తి శ్రీనివాస్ బొడ్డు సాయి నర్సింగ్ నాగరాజు రాపర్తి లక్ష్మయ్య గుండ గాని పని తదితరులు ఉన్నారు.



## స్నేహం రెండు అక్షరాలు వందల జ్ఞాపకాలు

**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :** ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా జగదిరిగుట్ట బిజెపి ఆఫీసులో ముత్యాల యాదగిరి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా దాదాపుగా 20 మంది స్నేహితులు న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల కూకట్ పల్లి లో చదువుకున్న స్నేహితులందరూ కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల మిత్రులు మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి నేటి వ్యాపార ఉద్యోగాలలో స్థిరపడి ఉన్న వారంతా కష్టసుఖాలను పాలుపంచుకున్నారు. ఒకరినొకరు చేస్తున్న ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలను, ఇప్పుడున్న ఈ పోటీ ప్రపంచంలో కష్టసుఖాలను తెలుపుతూ, స్నేహం అనేది జీవితంలో ఒక ముఖ్యమైన భాగం, ఇది మనకు ఎన్నో మంచి అనుభవాలను అందిస్తుంది. అని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. దీంతో స్నేహితుల సంబరాలు ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే చదువుకున్న కళాశాల గురించి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల యాదగిరి, పరమేశ్వరుడు, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, కరుణాకర్, నరేష్, స్వామి, వీరేష్, బీరప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

## అణు బెదిరింపుల పట్ల మరింత అప్రమత్తత అవసరం : రష్యా




**రష్యా :** రష్యాకు చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ నౌకాదళాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే రష్యా స్పందిస్తూ.. తమ వద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని పేర్కొంది. తాజాగా ఈ విషయంపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ.. అణ్వాయుధాల వ్యాప్తిని నిరోధించడంపై తాము మరింత శ్రద్ధ వహిస్తామన్నారు. అణు బెదిరింపుల విషయంలో ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రపంచ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ త్వరలో మాస్కోలో పర్యటించనున్న నేపథ్యంలో దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విట్కాఫ్ పర్యటనపై మాట్లాడుతూ.. ఆయన్ను మాస్కోకు ఆహ్వానించడానికి తాను ఎదురు చూస్తున్నానన్నారు. అటువంటి వారితో సంబంధాలు మెరుగుపరుచుకోవడం చాలా ముఖ్యమైన విషయంగా భావిస్తున్నట్లు తెలిపారు. వీలైతే ఆయన పుతిన్‌తోనూ సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కాగా ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజుల్లో ముందుకు రావాలని రష్యాకు హెచ్చరికలు చేశారు. దీంతో ఆగ్రహించిన మాస్కో మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ రష్యా వద్ద సోవియట్ యూనియన్ హయాం నాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు. దీంతో ఆ దేశానికి చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ఆదేశించారు. "ఒకవేళ మెద్వదేవ్ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ముఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణామాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాంటివి జరగవని ఆశిస్తున్నా" అని తెలిపారు. మరోవైపు భారత్, రష్యా సబంధాలపైనా ట్రంప్ పలు విమర్శలు చేసిన విషయం తెలిసిందే.



## ఇజ్రాయెల్ బందీల దీనస్థితి..
### మానవతా సాయంపై మెత్తబడిన హమాస్


**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో దుర్భర పరిస్థితులు తలెత్తాయి. అక్కడి ప్రజల పరిస్థితి అత్యంతదారుణంగా మారిపోయింది. మరోవైపు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలు ఆకలితో అలమటిస్తున్నారు. ఇటీవల అక్కడి బందీలకు సంబంధించిన పలు దృశ్యాలు, వీడియోలు బయటకు వచ్చాయి. వాటిలో ఇజ్రాయెలీలు ఎముకల గూళ్లుగా మారిన శరీరాలతో దారుణస్థితిలో కనిపించడంపై ఆ దేశ ప్రధాని నెతన్యాహు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. హమాస్ చెరలోని తమ బందీలకు మానవతా సాయం అందేలా చూడాలని రెడ్‌క్రాస్ సంస్థను కోరారు. ఇన్నాళ్లు ఇజ్రాయెల్ బందీలను తీవ్ర హింసలకు గురిచేసిన హమాస్ సైతం ఈ విషయంలో కొంతమేరకు మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ తమ షరతులకు అనుగుణంగా వ్యవహరిస్తే.. తమ వద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటన విడుదల చేసింది. అయితే ఈ సహాయాన్ని అందించడానికి కేవలం అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీని మాత్రమే అనుమతిస్తామని వెల్లడించింది. అయితే దీనిని కొనసాగించాలా, వద్దా అనే విషయం ఇజ్రాయెల్ మానవతా కారిడార్లను తెరవడం, గాజా ప్రజలకు మానవతా సాయం అందిస్తున్న సమయంలో వైమానిక దాడులను ఆపడం వంటి వాటిపై ఆధారపడుతుందని తెలిపింది. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం 50 మంది పౌరులు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. వీరిలో 20 మంది మాత్రమే ప్రాణాలతో ఉన్నట్లు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా చేసుకున్న నాటి నుంచి నేటివరకు మానవతా సంస్థలు వారిని సంప్రదించకుండా హమాస్ నిషేధించింది. దీంతో వారి పరిస్థితి గురించి అధికారులకు గానీ, కుటుంబసభ్యులకు గానీ ఎటువంటి సమాచారం లేదు. ఈనేపథ్యంలో నిర్బంధంలో ఉన్న బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ ఇటీవల కొన్ని వీడియోలు విడుదల చేసింది. ఓ భూగర్భ సొరంగంలో బందీగా ఉన్న యువకుడు ఎవ్యతార్ డేవిడ్ (24) బక్కచిక్కిన శరీరం, మాట్లాడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఓ వీడియోలో కనిపించింది. తాను ఎదుర్కొంటున్న దీనస్థితిని వివరిస్తూ.. "రోజురోజుకు నా శరీరం క్షీణిస్తోంది. కుటుంబంతో గడిపే పరిస్థితి కనిపించడం లేదు. విడుదలకు సమయం మించిపోతోంది. నా సమాధిని నేనే తవ్వుకుంటున్నా" అని పేర్కొన్నాడు. ఈ వీడియోపై ఫ్రాన్స్, జర్మనీ, యూకే, అమెరికా వంటి దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. గాజాలో బందీల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారం ఉదయం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

## చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు?
### కేంద్రానిది 'డీడీఎల్‌జే' పాలసీ : కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 15, 2020న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధాని.. మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు అమరులైనప్పటి నుంచి.. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడు అనేక ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. సమాధానాలు ఇవ్వడానికి బదులుగా, మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' అనే విధానాన్ని అనుసరిస్తూ వస్తోందంటూ ధ్వజమెత్తారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులైనా సృష్టించగదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. చైనా మన భూ భాగాన్ని ఆక్రమించిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను సోమవారం సుప్రీం కోర్టు తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం.. నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరంటూ వ్యాఖ్యానించింది.

## ఆంక్షలు.. అణు జలాంతర్గాములు
### భారత్, రష్యాలపై ఒత్తిడికి అమెరికా విశ్వయత్నం



**యూఎస్ :** ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వాగ్దానం విషయంలో పుతిన్ వద్ద ట్రంప్ పప్పులు ఉడక్కపోవడంతో.. అమెరికా అక్కసు బయటపెడుతోంది. నయానో భయానో మాస్కోపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు తీవ్రంగా యత్నిస్తోంది. దీనిలోభాగం గా ఇప్పటికే రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్‌తో సోషల్ మీడియాలో వాగ్వాదం హద్దులు దాటిం ది. దీంతో రష్యా మాజీ అధ్యక్షుడైన మెద్వదేవ్ 'డెడ్‌హ్యాండ్' ఆయుధ వ్యవస్థను గుర్తుంచుకోవాలని ట్రంప్‌ను నేరుగా హెచ్చ రించారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడిన అమెరికా.. రెండు అణు జలాంతర్గాములను రష్యాకు అత్యంత సమీపంలో మోహ రించినట్లు ప్రకటించారు. తాజాగా ఈ అంశంపై ట్రంప్ మా ట్లాడుతూ తమ అణు జలాంతర్గాములు తగినచోటే మోహరిం చి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ అంశంపై మాట్లాడేందుకు పెంటగాన్, అమెరికా నౌకాదళం నిరాకరించాయి.

#### రష్యా అణుజలాంతర్గామి స్థావరం దెబ్బతిందా..?

జులై 30న రష్యాలో తూర్పు ప్రాంతంలో 8.8 తీవ్రతతో వచ్చిన భారీ భూకంపం కారణంగా రైబాచై నౌకాదళ స్థావరం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పశ్చిమదేశాల పత్రికలు వెల్లడించాయి. దీనిలో మాస్కో పసిఫిక్ దళానికి చెందిన అణు సబ్‌మెరైన్లు ఉంటాయి. వీటిల్లో కొన్ని చెల్లాచెదురైనట్లు అంబ్రా ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయి. ఇక్కడ బోరై శ్రేణి, సోవియట్ కాలం నాటి డెల్టా జలాంతర్గాములను నిలిపినట్లు ది టెలిగ్రాఫ్ పత్రిక కథనంలో పేర్కొంది. ఇవి అమెరికా వైపు మోహరించడానికి అనువుగా ఉంటాయని వెల్లడించింది. మాస్కో జలాంతర్గాముల పరిస్థితిపై నీలినీడలు కమ్ముకున్న ఈ సమయంలో అమెరికా సబ్‌మెరైన్లను మోహరించడం గమనార్హం.

#### ఆ యుద్ధానికి భారత్ సాయం: ట్రంప్ సలహాదారు

ట్రంప్ కార్యవర్గంలో శక్తిమంతమైన సహాయకుల్లో ఒకరైన డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్ భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కీవ్‌పై మాస్కో చేస్తున్న యుద్ధానికి భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపాలని ట్రంప్ న్యూదిల్లీపై ఒత్తిడి చేస్తున్నవేళ ఈ కామెంట్స్ రావడం గమనార్హం. మిల్లర్ మాట్లాడుతూ భారత్ ఈ కొనుగోళ్లను ఆపేస్తుందని ట్రంప్ బలంగా విశ్వసిస్తున్నారని చెప్పారు. చైనాతో కలిసి భారత్ మాస్కో నుంచి కొనుగోలు చేస్తున్న చమురు మొత్తం చూస్తే ప్రజలు షాకవుతారన్నారు. అది ఆశ్చర్యకరమైన వాస్తవమన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీతో ట్రంప్‌నకు అద్భుతమైన స్నేహబంధం ఉందన్నారు.

## అది నరమేధం కాదు.. కచ్చితంగా యుద్ధమే : ట్రంప్



**యూఎస్ :** గాజాలో పరిస్థితులు రోజు రోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. ఆహారం దొరక్క అకలి కేకలు వినిపిస్తున్నాయి. అక్కడి చిన్నారుల్లో పౌష్టికాహార లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ పౌరుల పరిస్థితీ అంతే. ఇటీవల అక్కడి బందీలకు సంబంధించిన పలు దృశ్యాలు, వీడియోలు బయటకు వచ్చాయి. వాటిలో ఇజ్రాయెలీలు ఎముకల గూళ్లుగా మారిన శరీరాలతో దారుణ స్థితిలో కనిపించడం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. గాజా ప్రజల ఆకలి తీర్చాలనుకుంటున్నట్లు చెప్పారు. కేవలం అమెరికా మాత్రమే ఆ పని చేయగలద న్నారు. హమాస్‌పై ఇజ్రాయెల్ ప్రతిస్పందనను 'నరమేధం'గా భావిస్తున్నారా? అని ట్రంప్‌ను విలేకరులు ప్రశ్నించగా.. దానిని నరమేధంగా తాను భావించడం లేదని, హమాస్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్నది యుద్ధమేనని అన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ చేపట్టిన దుందుడుకు చర్యవల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయన్నారు. హమాస్ దాడిలో కొన్ని భయానక ఘటనలు జరిగాయని చెప్పారు. " గాజా ప్రజల కడుపు నింపాలనుకుంటున్నాం. కేవలం అమెరికా వల్లే అది సాధ్యమవుతుంది. దీని కోసం ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయిస్తున్నాం. గాజాలోని సామాన్య ప్రజలకు ఇజ్రాయెల్ అధికారులే నేరుగా ఆహారం అందించాలని కోరుకుంటున్నాం. లేదంటే పరిస్థితులు మరింత విషమించే అవకాశం ఉంది. అప్పుడప్పుడూ కొన్ని దుర్ఘటనలు జరుగుతుంటాయి. అలాగని ఎవరూ ఆకలితో అలమటించడం మాకిష్టం లేదు" అని ట్రంప్ పేర్కొన్నారు.

#### జీహెచ్‌ఎఫ్‌పై ఐరాస మండిపాటు

మరోవైపు గాజా మానవతా నిధి (జీహెచ్‌ఎఫ్) తీరును ఐక్యరాజ్యసమితి (ఐరాస) తప్పుబట్టింది. జీహెచ్‌ఎఫ్ చేపట్టిన సహాయక చర్యలు గాజా ప్రజలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని మండిపడింది. జీహెచ్‌ఎఫ్ ఆధ్వర్యంలోని ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలు, అక్కడికి వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దళాలు జరిపిన కాల్పుల్లో మే నుంచి ఇప్పటి వరకు 1000 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస పేర్కొంది.

## అమెరికాలో పెట్టుబడులకు భారతీయులు సై




**యూఎస్ :** అగ్రరాజ్యం అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయులు బాగా ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదని డేటా చెబుతోంది. త్వరలో వీటిని ట్రంప్ ప్రకటించిన గోల్డ్‌కార్డులతో భర్తీ చేయనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈబీ-5 దరఖాస్తులకు సంబంధించిన డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు దీని కోసం ఏడాది వ్యవధిలో దరఖాస్తు చేసుకొన్నట్లు అర్థమవుతుంది. గతేడాది ఏప్రిల్ 2024 నుంచి భారతీయుల్లో దీనికి ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ డేటా "2025 ఆర్థిక సంవత్సరం (అక్టోబర్ 2024 నుంచి జనవరి 2025)లో భారతీయుల నుంచి 1,200కు పైగా ఐ-526ఈ పిటిషన్లు వచ్చాయి" అని యూఎస్ఐఎఫ్ సీఎంవో నికోలస్ మాస్ట్రోన్నీ-3 పేర్కొన్నారు. ఇతర రకం వీసాల జారీలో పెద్ద సంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ, గ్రీన్‌కార్డుల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటి వరకు ఇమిగ్రేషన్ సంస్థ వద్ద దాదాపు 1.1 కోట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో వేగంగా లభించే ఈబీ-5ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకొన్నారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ డేటా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయులకు 1,428 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే.

#### మరింత కఠినంగా గ్రీన్‌కార్డ్..

అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం అక్కడి ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేసింది. తాజాగా యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ వీటిని ప్రకటించింది. కుటుంబ సభ్యులకు జారీ చేసే ఇమిగ్రెంట్ వీసాలకు కూడా స్క్రీనింగ్, వెట్టింగ్ ప్రక్రియను కఠినతరం చేసింది. అనర్హమైన అప్లికేషన్లు తొలగించేందుకు దీనిని చేపట్టినట్లు ప్రకటించింది. యూఎస్‌సీఐఎస్ సంస్థ మరింత పకడ్బందీగా అర్హమైన వివాహాలను, సరైన కుటుంబసంబంధాలను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందని వెల్లడించింది. దీంతోపాటు అవసరమైన చట్టాలను పాటిస్తున్నారని ధ్రువీకరించుకొనేం దుకు ఇది అవసరమని భావించారు. ఇక జాతీయ భద్రతకు ఇబ్బందిలేకుండా ఇబ్బందికర వ్యక్తులను గుర్తించేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటిని పెండింగ్‌లో ఉన్న, కొత్తగా దరఖాస్తు చేసుకొన్న వాటికి వర్తింపజేయనున్నారు. నకిలీ వివాహాలు చేసుకొని అమెరికాలోకి ప్రవేశించే వారిని అరికట్టడం కూడా దీని లక్ష్యం. ఇకనుంచి వివాహాలకు సంబంధించి అధికారులకు మరింత సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వీటిల్లో జాయింట్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్, ఫొటోగ్రాఫ్, మిత్రులు, బంధువుల నుంచి అభినందన పత్రాలు వంటివి ఉన్నాయి. దీంతోపాటు వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి. స్పాన్సర్ గతంలో ఎవరికైనా స్పౌస్‌ల వీసాలు జారీ చేసినా.. ఇమిగ్రేషన్ రికార్డుల్లో తేడాలు ఉన్నా వాటిని యూఎస్‌సీఐఎస్ మరింత లోతుగా దర్యాప్తు చేపడుతుంది.

## ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు



**పట్నా :** ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యా దవ్‌పై పట్నాలోని దిఘా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైం ది. ఆయనకు రెండు ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయంటూ న్యాయవాది రాజీవ్ రంజన్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంది. శనివారం తేజస్వీ ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ తన పేరు సరికొత్త ఓటర్ల జాబితా నుంచి మాయమైందని ఆరోపించారు. దీంతో ఒక్కసా రిగా అప్రమత్తమైన ఎన్నికల అధికారులు జాబితాలను తెప్పిం చుకొని వెతికారు. బిహార్ యానిమల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బిల్డింగ్‌లోని పోలింగ్ బూత్ 204లో దానిని గుర్తించా రు. జాబితాలో 416 నెంబర్‌లో తేజస్వీ వివరాలున్నాయని పే ర్కొన్నారు. వాస్తవానికి అంతకు ముందు తేజస్వీ ఎన్నికల కమి షన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ అసలు తన పేరే ఓటర్ జాబితాలో లేదని సంచలన ప్రకటన చేశారు. బిహార్‌లో ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ విడుదల చేసిన రోజే ఎన్నికల కమిషన్ భాజపా కోసం ఓట్లను చోరీ చేసిందంటూ ప్రతిపక్ష నేత రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తేజస్వీ ప్రకటన రావడం గమనార్హం. దీనిపై భాజపా నాయకులు మండిపడ్డారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ రాహుల్, తేజస్వీ అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.



## శ్రీకృష్ణుడే మొదటి రాయబారి
### సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు

**ఉత్తర్‌ప్రదేశ్ :** ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీబాంకే బిహారీ టెంపుల్ ట్రస్ట్ వివాదంలో సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శ్రీకృష్ణుడే మొదటి రాయబారి అని.. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలంటూ ఇరుపక్షాలకు సూచించింది. ఇందుకోసం ఒక కమిటీని ప్రతిపాదించింది. ఆలయ నిధుల నుంచి రూ.500 కోట్లతో కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విచారణ సందర్భంగా శ్రీకృష్ణుడి రాయబారం గురించి సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఆర్డినెన్స్‌ను ఆమోదించడంలో తొందర ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీని రాజ్యాంగబద్ధతను పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది.

## విమానంలోకి బొద్దింకలు.. అలా వచ్చిఉండొచ్చేమో
### ఎయిరిండియా వివరణ




**ముంబయి :** ఎయిరిండియా ఇటీవల తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఇప్పుడు బొద్దింకల దెబ్బకు శాన్ ఫ్రాన్సిస్కో -ముంబయి విమానంలోని ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. దాంతో విమానయాన సంస్థ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. "శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబయి బయల్దేరిన విమానంలో ఇద్దరు ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. చిన్న బొద్దింకల వల్ల వారు ఇబ్బందిపడ్డారు. మా సిబ్బంది వెంటనే స్పందించి, అదే క్యాబిన్‌లో వేరేచోట వారికి సీట్లు కేటాయించారు. కోల్‌కతాలో ఇంధనం కోసం ల్యాండ్ అయిన సమయంలో బొద్దింకలు ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయించాం. తర్వాత షెడ్యూల్ సమయం ప్రకారమే ముంబయికి విమానం చేరుకుంది. నిర్వహణప రంగా అంతా సక్రమంగానే ఉన్నప్పటికీ.. గ్రౌండ్ ఆపరేషన్స్ సమయంలో ఈ కీటకాలు ఒక్కోసారి విమానంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది" అని ఎయిరిండియా ప్రతినిధి తన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇదిలాఉంటే.. ఆదివారం సాయంత్రం కోల్‌కతా బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో వెంటనే బెంగళూరుకు మళ్లించారు. మరో విమానంలో ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని సంస్థ వెల్లడించింది. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ తిరిగి తన చేతుల్లోకి తీసుకున్నప్పటినుంచి విమానయాన సంస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. ఎయిరిండియా విమాన సర్వీసులు తరచూ ఆలస్యం అవుతున్నాయని, సాంకేతిక లోపాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో అహ్మదాబాద్‌లో అతిపెద్ద విమాన ప్రమాదం చోటుచేసు కున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఎయిరిండియాతో పాటు దేశంలోని 8 విమానయాన సంస్థల్లో గత ఏడాదిలో 23 ఆడిట్లు నిర్వహించగా, 263 లోపా లు గుర్తించినట్లు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. సత్వరం సరిదిద్దుకోవాల్సిన లోపాలు కూడా బయటపడినట్లు పేర్కొంది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా (విలీనమైన విస్తారాతో కలిపి), ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లలో మొత్తం 93 లోపాలు గుర్తించగా, వీటిలో 19 లెవెల్-1 లోపాలు ఉన్నాయని తెలిపింది. లెవెల్-1 లోపాలు అంటే కీలకమైన భద్రతకు సంబంధించినవి. వీటిని వెంటనే సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. ఇండిగోలో 23, స్పైస్‌జెట్‌లో 14, అలయన్స్ ఎయిర్‌లో 57, క్విక్ జెట్, ఫ్లోడావాట్ స్టార్‌లో లోపాలు గుర్తించినట్లు డీజీసీఏ వెల్లడించింది. లెవెల్-2 లోపాల్లో నిబంధనల ఉల్లంఘన వంటివి ఉంటాయి.

## మన భూభాగాన్ని చైనా ఆక్రమించిందని మీకెలా తెలుసు?
### రాహుల్‌కు సుప్రీం ప్రశ్న



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకు ందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరని వ్యాఖ్యానించింది. రాహుల్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న సమస్యలను ప్రశ్నించకపోతే రాహుల్ ప్రతిపక్ష నాయకుడు ఎలా అవుతారని వాదించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఏదైనా సమస్య లేదా విషయంపై మాట్లాడాలంటే పార్లమెంటులో మాట్లాడాలని.. సోషల్ మీడియాలో కాదని పేర్కొంది. ఇటువంటి సమస్యలను పార్లమెంటులో ఎందుకు లేవనెత్తరని ప్రశ్నించింది. 2022లో దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ..పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "2020 జూన్‌లో లడఖ్‌లోని గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన హింసాత్మక ఘర్షణ సమయంలో దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూగాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. ఇది దిల్లీ వైశాల్యం కంటే ఎక్కువ. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్నవారు దాని గురించి ఒక్క ప్రశ్న కూడా అడగరు. అరుణాచల్‌ప్రదేశ్‌లో 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ భూభాగాన్ని తిరిగి ఇవ్వాలంటూ మన సైన్యం చైనా సైన్యంతో చర్చలు జరిపినప్పటికీ ప్రధాని మోదీ ఈ విషయంలో అబద్ధాలు చెబుతున్నారు.. ఆక్రమణే జరగలేదంటున్నారు. దీని గురించి దేశ మీడియా ప్రశ్నించడం లేదు. ఇది నిజం కాదా..? ఇదంతా యావత్ దేశం గమనిస్తోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో రాహుల్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దేశ సైన్యాన్ని అవమానించేలా మాట్లాడారని ఆరోపిస్తూ 2022లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి న్యాయస్థానంలో ఫిర్యాదు దాఖలు చేశారు.

# ఉత్కంఠ పోరులో భారత్‌దే విజయం

## 2-2తో సిరీస్ సమం

**లండన్:** ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో టీమ్‌ఇండియా సంచలన విజయం సాధించింది. 374 పరుగుల లక్ష్యఛేదనలో హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) శతకాలు బాదడంతో ఇంగ్లాండ్ ఒకదశలో 301/3తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయినా, భారత బౌలర్లు వెరవలేదు. ఏ మాత్రం అధైర్యపడకుండా అద్భుతంగా పోరాడారు. ఒక్కో వికెట్టూ పడగొడుతూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఆఖరి రోజూ మరింత విజృంభించి ఇంగ్లాండ్ చేతిలోంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఫలితంగా ఇంగ్లాండ్ గడ్డపై భారత జట్టు మరుపురాని విజయం అందుకుని అండర్సన్-తెందూల్కర్ ట్రోఫీని 2-2తో ముగించింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్ల పోరాటం టెస్టు క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందనడంలో సందేహం లేదు. ఓవర్‌నైట్ స్కోరు 339/6తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ 367 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా.. ఆట ప్రారంభమయ్యాక తొలి ఓవర్‌లోనే జేమీ ఒవర్టన్ (9) రెండు ఫోర్లు బాదాడు. అయితే, సిరాజ్ వరుస ఓవర్లలో జేమీ స్మిత్ (2), ఒవర్టన్‌ను పెవిలియన్‌కు పంపి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. కాసేపటికే జోష్ టంగ్ (0)ని ప్రసిద్ధ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోరు 357/9. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన క్రిస్ వోక్స్ భుజానికి పట్టితోనే బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి వచ్చాడు. అయితే, వోక్స్ ఒక్క బంతిని కూడా ఎదుర్కోలేదు. సిరాజ్ బౌలింగ్‌లో అట్కిన్సన్ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. మళ్లీ బంతి అందుకున్న సిరాజ్.. అట్కిన్సన్ క్లీన్‌బౌల్డ్ చేసి ఐదు వికెట్లు పూర్తి చేసుకోవడంతోపాటు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. ప్రసిద్ధ్ కృష్ణ 4, ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224, ఇంగ్లాండ్ 247 పరుగులకు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 396 పరుగులు చేసింది.

### సిరాజ్ మళ్లీ హీరో అయ్యాడు

నాలుగో రోజు సిరాజ్ ఓ పొరపాటు చేశాడు. 19 పరుగుల వద్ద బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ చేజార్చాడు. మ్యాచ్‌లో ఇదే కీలక మలుపు. తర్వాత బ్రూక్ చెలరేగి పోయి శతకం చేశాడు. అయితే, చివరి రోజు సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి మళ్లీ భారత జట్టు విజయానికి బాటలుపరిచి హీరో అయ్యాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లాండ్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. ఆఖరి రోజు 4.1 ఓవర్లు బౌలింగ్ చేసిన సిరాజ్ తొమ్మిదే పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. రెండు ఇన్నిం గ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. శుభ్‌మన్ గిల్, హ్యారీ బ్రూక్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో గెలిచింది. 2004లో ఆస్ట్రేలియాపై 13 రన్స్ తేడాతో విజయం సాధించింది.



### అదే వ్యూహంతో ముందుకెళ్లాం : శుభ్‌మన్ గిల్

ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి టెస్టులో భారత్ అద్భుత విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరిసీస్‌ను 2-2తో సమం చేసింది. 374 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 339/6తో ఆఖరి రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ 367 పరుగులకు ఆలౌటైంది. మహ్మద్ సిరాజ్ 5 వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణ 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మ్యాచ్ అనంతరం టీమ్‌ఇండియా ఆటగాళ్లు.. తమ అనుభవాలను పంచుకున్నారు.

### రెండు జట్ల ఆట అత్యద్భుతం : శుభ్‌మన్ గిల్

సిరీస్ చివరి టెస్టులో రెండు జట్లూ అద్భుతంగా ఆడాయని టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. చివరి రోజుకు వచ్చినంత వరకు ఫలితం తేలకపోవడమే ఇందుకు నిదర్శనమన్నాడు. రెండు జట్లూ 'ఏ' గ్రేడ్ ఆట ఆడాయన్నాడు. " మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ లాంటి బౌలర్లుంటే కెప్టెన్ పని సులభమవుతుంది. ఇవాళ మా ప్రదర్శన అత్యద్భుతం. కచ్చితంగా గెలుస్తామన్న నమ్మకం నిన్న కూడా ఉండేది. ఆ జట్టుపై తీవ్ర ఒత్తిడి ఉందన్న సంగతి మాకు తెలుసు. అది చివరి వరకు కొనసాగేలా చూసుకోవాలనుకున్నాం. అదే వ్యూహంతో ముందుకెళ్లాం. సిరాజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. 2-2తో సిరీస్ సమమైందంటేనే ఇరు జట్లూ ఎంతలా ఆడాయో అర్థం చేసుకోవచ్చు. ఈ సిరీస్‌లో అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా నిలవాలన్న లక్ష్యంతోనే సిరీస్ ఆడా.. ఆ స్థితికి చేరుకోవడం చాలా సంతృప్తిగా ఉంది. మానసికంగా కొన్ని విషయాలను సమతుల్యం చేసుకోవడం అవసరం. గత ఆరు వారాల్లో నేర్చుకున్నది ఎప్పటికీ గుర్తుంచుకుంటాం" అని గిల్ అన్నాడు.

### అదే లక్ష్యంతో బౌలింగ్ చేశా : మహ్మద్ సిరాజ్

మ్యాచ్ అనంతరం మహ్మద్ సిరాజ్ మాట్లాడుతూ.. కీలక ప్రదేశాల్లో బంతులు వేసి బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా చేసుకున్నట్లు చెప్పాడు. వికెట్లు పడతాయా? లేదా? పరుగులు కొడతారా? కొట్టరా? లాంటి విషయాలు అస్సలు పట్టించుకోలేదన్నాడు. బౌండరీ వద్ద హ్యారీ బ్రూక్ క్యాచ్‌ను అందుకున్న తర్వాత లైన్‌ను తాకుతాననుకోలేదన్నాడు. "మ్యాచ్ పరిస్థితులను మార్చేసిన క్షణమది. ఆ తర్వాత బ్రూక్ అమాంతం జోరు పెంచేశాడు. టీ20లు ఆడినట్లు ఆడేశాడు. దీంతో మేం కాస్త వెనకబడ్డాం. కానీ, ఏ దశలోనైనా గెలుస్తామన్న నమ్మకం నాకుండేది. అదే జరిగింది. ఆ భగవంతుడికి కృతజ్ఞతలు" అని సిరాజ్ తెలిపాడు.

### ఇంత మజా ఏదీ ఇవ్వలేదు: కేఎల్ రాహుల్

"నేను చాలా ఏళ్లుగా క్రికెట్ ఆడుతున్నా. ఛాంపియన్స్ ట్రోఫీ సొంతం చేసుకున్నాం. ప్రపంచకప్‌ను కూడా గెలిచాం. కానీ, ఈ మ్యాచ్ అంత మజా ఏదీ ఇవ్వలేదు. టెస్టు క్రికెట్ మనుగడ సాగిస్తుందా? లేదా? అని చాలా మంది సందేహపడుతుంటారు. టీమ్ ఇండియా ఆట తీరుతో అది పటాపంచలైంది. ప్రతి మ్యాచ్‌లోనూ పోరాడాం. సిరీస్‌ను 2-2తో సమం చేశాం. సిరీస్ డ్రా అవ్వొచ్చుగానీ.. భారత టెస్టుకు క్రికెట్‌ను అగ్రస్థానంలో నిలిపింది. మార్పు ఇక్కడి నుంచే మొదలవుతుంది. భారత టెస్టు జట్టు ఎన్నో విజయాలు సాధిస్తుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, అశ్విన్ లాంటి ఆటగాళ్లు లేకుండా సిరీస్‌లో అడుగుపెట్టాం. గిల్ ముందుండి అద్భుతంగా నడిపించాడు.

## పేటీఎం నుంచి యాంట్ గ్రూప్ ఔట్



ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం నుంచి యాంట్ గ్రూప్ పూర్తిగా వైదొల గనుంది. పేటీఎంలో ఉన్న మిగిలిన 5.4 శాతం వాటాను బ్లాక్‌డీల్ ద్వారా పూర్తిగా విక్రయించనుంది. గోల్డ్‌మన్ శాక్స్ ఇండియా సెక్యూరిటీస్, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా సేల్ నిర్వహించను న్నాయి. మంగళవారం జరగబోయే ఈ బ్లాక్‌డీల్‌లో భాగంగా ఒక్కో షేరు ఫ్లోర్‌ప్రైస్‌ను రూ.1020గా నిర్ణయించి నట్లు తెలిసింది. దీని విలువ సుమారు రూ.3,845 కోట్లుగా ఉండబోతోంది. సోమవారం మార్కెట్ ముగిసే సమయా నికి పేటీఎం షేరు విలువ రూ.1078.20తో పోలిస్తే 5.4 శాతం డిస్కౌంట్‌కే షేర్ల విక్రయం జరగనుంది. పేటీఎం మాతృ సంస్థ అయిన వన్97 కమ్యూని కేషన్స్‌లో గడిచిన రెండేళ్లలో పలు సంస్థలు తమ వాటాలను విక్రయించాయి. వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాత్‌వే, జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ తమ వాటాలు విక్రయించాయి. అలీబాబాకు చెందిన యాంట్ గ్రూప్ కూడా 2023 ఆగస్టులో 10.3 శాతం వాటాను, ఈ ఏడాది మే నెలలో 4 శాతం వాటాను విక్రయించింది. తాజాగా మిగిలిన వాటానూ విక్రయించబోతోంది. దీనిపై అటు పేటీఎం గానీ, యాంట్ గ్రూప్ గానీ స్పందించలేదు.

## 'విదేశీ డిగ్రీల కోసం భారీగా అప్పులా?'

### జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఆందోళన



విదేశీ డిగ్రీల కోసం పెద్ద మొత్తంలో రుణాలు తీసుకోవడంపై జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఆందోళన వ్యక్తంచేశారు. రుణాల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అమెరికాలో జాబ్ మార్కెట్ నెమ్మదించడం, ఇమిగ్రేషన్ విధానాల కారణంగా అవస్థలు పడుతున్న ఓ భారతీయ ఐటీ విద్యార్థి ఉదంతాన్ని ప్రస్తావించారు. ఈమేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "ఇటీవల ఓ విద్యార్థి నుంచి నాకు కాల్ వచ్చింది. అతడు అమెరికాలో చదువుల కోసం 12 శాతం వడ్డీకి సుమారు రూ.70 లక్షలు రుణం తీసుకున్నాడు. అక్కడో చిన్న కాలేజీలో మాస్టర్ డిగ్రీ చదువుకున్నాడు. ఇప్పుడు అక్కడి జాబ్ మార్కెట్ ఆశించిన స్థాయిలో లేదు. మరీ ముఖ్యంగా విదేశీ విద్యార్థులకు ఉద్యోగం దొరకడం చాలా కష్టంగా ఉంది. త్వరలో ఆ విద్యార్థి తీసుకున్న రుణానికి ఈఎంఐ కూడా మొదలైపోతుంది" అంటూ ఆ విద్యార్థి పరిస్థితిని పోస్ట్ చేశారు. ఆ కాల్ తనను ఎంతో కలవరపరిచిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు, భారతీయ కంపెనీలకు కూడా శ్రీధర్ వెంబు కీలక విజ్ఞప్తి చేశారు. "విదేశీ డిగ్రీల కోసం భారీగా రుణాలు తీసుకొనే విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండండి. భారత్‌లోనైనా సరే పెద్ద మొత్తంలో రుణం తీసుకోవడమూ తెలివైన నిర్ణయం కాదు. చదువుల పేరుతో యువ భారతం అప్పుల ఊబిలో కూరుకుపోకూడదు. కంపెనీలు కూడా విద్యార్థులకు డిగ్రీలు అడగడం కాకుండా.. ట్రైనింగ్ ప్రోగ్రాములపై ఖర్చు చేయడం మంచిది. మా వరకు ట్రైనింగ్, నైపుణ్యాభివృద్ధిపై ఖర్చు చేస్తున్నాం. ఇతర కంపెనీలు కూడా అదే పని చేస్తాయని భావిస్తున్నా. అప్పుడే యువత అప్పుల ఊబిలో కూరుకుపోకుండా చూడగలం" అని శ్రీధర్ వెంబు పేర్కొన్నారు. ఏఐ యుగంలో పరిస్థితులు ఎప్పుడు, ఎలా ఉంటాయో చెప్పడం కష్టమని శ్రీధర్ పేర్కొన్నారు. అందుకే లేఆఫ్‌లు వంటి పరిస్థితులు తలెత్తకుండా తమ కంపెనీ నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నామని చెప్పారు. శ్రీధర్ వెంబు పోస్ట్‌పై పలువురు కామెంట్లు పెట్టారు. ఆయన అభిప్రాయంతో ఏకీభవించారు. జాబ్ మార్కెట్ గురించి అర్థం చేసుకోకుండా విదేశీ చదువుల మోజులో పడిపోతున్నారని పేర్కొంటున్నారు. ఈ విషయంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



## తమిళనాడులో విన్‌ఫాస్ట్ ఈవీ ప్లాంట్ ప్రారంభం

వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ దేశంలో తొలి ప్లాంట్‌ను ప్రారంభించింది. తమిళనాడులోని తూత్తుకుడిలో ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. 408 ఎకరాల్లో ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా రాబోయే ఐదేళ్లలో 3,500కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. గతేడాది గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, విన్‌ఫాస్ట్ మధ్య రూ.16 వేల కోట్ల పెట్టుబడికి ఒప్పందం కుదిరింది. ఈ ప్లాంట్ ద్వారా దేశీయంగా తొలుత ఏడాదికి 50 వేల ఈవీలను ఉత్పత్తి చేయగలదు. డిమాండ్ ఆధారంగా గరిష్ఠంగా 1,50,000 యూనిట్లను అందుకోగలదు. ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. శంకుస్థాపన చేసిన 17 నెలల్లోనే వాహన తయారీ కేంద్రాన్ని పూర్తి చేయడం రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతికి బలమైన సంకేతమని పేర్కొన్నారు. ఆటోమొబైల్ తయారీలో దేశంలోనే తమిళనాడు అగ్రస్థానంలో ఉందని చెప్పారు. చెన్నైని భారతదేశపు డెట్రాయిట్ నగరంగా అభివర్ణించారు. తూత్తుకుడి కూడా ఆటోమొబైల్ కేంద్రంగా వేగంగా ఎదుగుతోందన్నారు. తమిళనాడులో విన్‌ఫాస్ట్ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విన్‌ఫాస్ట్ 'వీఎఫ్7' మోడల్‌పై సంతకం చేసి ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తయిన తొలి వాహనాన్ని స్టాలిన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులతో పాటు విన్‌ఫాస్ట్ ప్రతినిధులు హాజరయ్యారు.

## మరిన్ని కష్టాల్లో అనిల్ అంబానీ

### దజనుకు పైగా బ్యాంకులకు ఈడీ నోటీసులు..



రిలయన్స్ గ్రూప్ అధిపతి అనిల్ అంబానీ కష్టాలు మరింత పెరిగాయి. ఇప్పటికే మనీలాండరింగ్ కేసులో ఆయన పాత్రపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా పలు బ్యాంకులకు నోటీసులు జారీ చేసి వివరాలను కోరింది. వీటిల్లో ఆయన కంపెనీలకు చెందిన రుణ మంజూరు పత్రాలు వంటివి ఉన్నాయి. మొత్తం 12-13 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు వెళ్లినట్లు తెలుస్తోంది. వీటిల్లో పబ్లిక్ సెక్టార్, ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు ఉన్నాయి. ఇవి రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ వంటి సంస్థలకు భారీగా అప్పులు ఇచ్చాయి. తాజాగా ఈడీ నోటీసులు అందుకొన్న జాబితాలో ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సింధ్ బ్యాంక్ ఉన్నట్లు ఆంగ్లపత్రిక ఎన్‌డీటీవీ కథనంలో పేర్కొంది. అనిల్ అంబానీ సంస్థలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బకాయిలుగా మారిన కేసుల్లో కొందరు అధికారులకు ఈడీ నుంచి నోటీసులు వెళ్లాయి. వీరిని లోన్ క్లియరెన్స్‌లకు సంబంధించి అనుసరించిన ప్రాసెస్‌లను అడిగినట్లు తెలుస్తోంది. గత వారం రూ.3,000 కోట్ల రుణ మోసం కేసులో అనిల్ అంబానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న పార్థసారథి బిస్వాల్‌ను అరెస్టు చేశారు. ఆయన బిస్వాల్ ట్రేడ్ లింక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎండీ. పీఎంఎల్‌ఏ చట్టాన్ని ఆయనపై ప్రయోగించారు. రిలయన్స్ పవర్ కోసం దాదాపు రూ.68.2 కోట్లకు తప్పుడు హామీ పత్రాలను అతడు సమర్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. యస్ బ్యాంక్ నుంచి రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు లభించిన రూ.3,000 కోట్ల రుణంపై ఈడీ దర్యాప్తు జరుగుతోంది. ఇది 2017-19 మధ్యలో జారీ అయింది. ఈ కేసులో గత వారం కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. ఈనెల 5న తమ ఎదుట హాజరుకావాల్సింది గా అనిల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. ఆయన విదేశాలకు పారిపోకుండా లుకౌట్ సర్క్యులర్‌ను కూడా ఇచ్చింది. దిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సి ఉంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదుచేయనుంది. రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు చెందిన కొంతమంది ఎగ్జిక్యూటివ్‌లకు కూడా రాబోయే రోజుల్లో సమన్లు జారీ చేయనున్నారు. కొన్నాళ్ల క్రితం ఈ గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. జులై 24 నుంచి మూడు రోజుల పాటు ఈ సోదాలు జరిగాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ ఈ చర్యలు చేపట్టింది.



## లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలుబీ మెటల్, ఐటీ, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా జులై నెలకు సంబంధించి అమెరికా జాబ్స్ డేటా ఊహించిన దానికంటే తక్కువగా వచ్చింది. దీంతో అమెరికా ఫెడ్ సెప్టెంబర్‌లో వడ్డీ రేట్లలో కోత విధిస్తుందన్న అంచనాలు మన మార్కెట్లలో జోష్ నింపాయి. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే ఆ మేర అక్కడి బాండ్లపై రాబడి తగ్గడంతో పాటు, డాలర్ కూడా బలహీన పడుతుంది. ఇది భారత్ వంటి వర్ధమాన మార్కెట్లకు లాభించే అంశం. ఈ క్రమంలోనే మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.4.5 లక్షల కోట్లు పెరిగి రూ.449 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 80,765.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,599.91) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,093.19 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 418.81 పాయింట్ల లాభంతో 81,018.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.40 పాయింట్ల లాభంతో 24,722.75 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, బీఈఎల్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.84 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3406 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# సినీ కార్మికుల వేతన పెంపును వ్యతిరేకించిన టీఎఫ్‌సీసీ

## షూటింగ్ విషయంలో కీలక నిర్ణయం

**హైదరాబాద్:** సినీ కార్మికుల వేతన పెంపును నిర్మాతలంతా వ్యతిరేకించారని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) తెలిపింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్మికుల వేతనాల పెంపుపై ఫిల్మ్ ఫెడరేషన్- ఫిల్మ్ ఛాంబర్ మధ్య కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తాము కోరినట్టుగా 30 శాతం వేతనం పెంచి ఇచ్చిన నిర్మాతల సినిమాల షూటింగ్స్‌కే వెళ్లేలా ఫెడరేషన్ తీసుకున్న నిర్ణయంపై చర్చల అనంతరం టీఎఫ్‌సీసీ ప్రకటన విడుదల చేసింది.




### టీఎఫ్‌సీసీ ప్రకటనలోని అంశాలివీ..

- తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఇప్పటికే చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. ఇటువంటి సమయంలో వేతనాలు పెంచాలనడం, కార్మిక శాఖ కమిషనర్ మార్గదర్శకత్వంలో, సామరస్యపూర్వక పరిష్కారం కోసం చర్చలు జరుగుతున్న సందర్భంలో ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదు. లేబర్ కమిషనర్ మాటను ధిక్కరిస్తూ ఈరోజు (ఆగస్టు 4) నుంచి 30 శాతం వేతనం పెంపు ఇస్తామన్న ప్రొడ్యూసర్ల నుంచి ఒప్పంద పత్రం తీసుకుని, సంబంధిత పత్రాన్ని ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేశాకే విధులకు వెళ్లాలని నిర్ణయించడం బాధాకరం. ఇది నిజాయతీతో కూడిన చర్చల స్ఫూర్తిని దెబ్బ తీస్తుంది.
- వేతనాల పెంపును యూనియన్‌లు డిమాండ్ చేయడం చిన్న నిర్మాతలకు ఆమోదయోగ్యం కాదు. ఆ పెంపు వారు భరించే స్థాయిలో లేదు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించారు. కనీస వేతన చట్టం ప్రకారం.. ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. అదనంగా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫెడరేషన్ల ఒత్తిడి, పోటీని నిరోధించే పద్ధతులను ఖండిస్తూ, అలాంటి నిబంధనలను అమలు చేయకుండా నిరోధించింది.
- జీవన వ్యయం విషయంలో మిగతా మెట్రోపాలిటన్ సిటీలతో పోలిస్తే మన హైదరాబాద్‌లో తక్కువ. అయినప్పటికీ మనం అన్ని యూనియన్ల వారికి ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నాం. ఇతర చలన చిత్ర పరిశ్రమల్లో ఇచ్చే వేతనాల కంటే తెలుగు రాష్ట్రాల్లో పని చేసే కార్మికులకు అధిక వేతనాలు ఇస్తున్నాం.
- ఈ నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఏకగ్రీవంగా ఓ తీర్మానం చేసింది. నిర్మాతలు ఇవ్వగలిగే వేతనానికి పని చేయాలనుకున్న వర్కర్స్.. యూనియన్‌లో లేకపోయినా వారితో షూటింగ్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఎంతోమంది ఔత్సాహిక నిపుణులు/కార్మికులు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ యూనియన్లలో సభ్యత్వం కోసం రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలోకి వారు వచ్చేందుకు అవరోధం కలిగిస్తున్నారు. ఇది ఎంతోమంది కార్మికుల పొట్ట కొట్టడమే. ప్రాజెక్టు అవసరాలు, వ్యక్తుల సామర్థ్యం ఆధారంగా కార్మికులతో కలిసి పనిచేసే స్వేచ్ఛ నిర్మాతలకూ ఉంటుంది.
- ఎవరైనా ఔత్సాహిక నిపుణులు/ కార్మికులు సినీ రంగంలో పనిచేయాలంటే వారితో పని చేయించుకోవడానికి నిర్మాతలందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సభ్యత్వం కోసం రూ.లక్షలు ఇవ్వాల్సిన అవసరం లేదు. నైపుణ్యం ఉన్న కార్మికులకు పని కల్పించడమే మా ధ్యేయం.
- ఇండస్ట్రీలో కళాకారులు, సాంకేతిక నిపుణులు, ఇతర స్టేక్ హోల్డర్స్ ఉంటారు. వీరందరితో పని చేస్తూ ఒక సానుకూల నిర్ణయం వైపు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి పని చేస్తుంది.
- నిర్మాత లేనిదే సినిమా పరిశ్రమ లేదు. మన ఇండస్ట్రీ మనుగడ కోసం నిర్మాత శ్రేయస్సు అతి ముఖ్యమైన విషయం అని కార్మిక సంఘాలు మరోసారి గుర్తించాలి.



## రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'మహావతార్ నరసింహ'

ఎలాంటి ప్రచారం లేకుండా విడుదలై సంచలనం సృష్టిస్తోంది 'మహావతార్ నరసింహ'. ఇప్పటికే పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్న ఈ సినిమా ఇప్పుడు మరో ఘనతను సాధించింది. రూ.100 కోట్ల క్లబ్‌లో స్థానం సొంతం చేసుకుంది. తాజాగా దీని వసూళ్లను తెలుపుతూ నిర్మాణసంస్థ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇండియాలో ఇప్పటివరకూ రూ.105 కోట్లు వసూలుచేసినట్లు తెలిపింది. పది రోజుల్లో ఈ ఘనత సాధించినందుకు టీమ్‌కు నెటిజన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. మొదటిరోజు రూ.1.35 కోట్లు మాత్రమే రాబట్టిన చిత్రం పదో రోజు ఏకంగా రూ.10 కోట్లకు పైగా కలెక్షన్లు సొంతం చేసుకోవడం విశేషం. ఇక ఇప్పటికే ఈ సినిమా దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ ఫిల్మ్‌గా రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. హొంబలే ఫిల్మ్స్ 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా ఏడు సినిమాలను అందించనున్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న రెండో సినిమా 'మహావతార్ : పరశురామ్' దీనికంటే పవర్‌ఫుల్‌గా ఉంటుందని తాజాగా దర్శకుడు అశ్విన్‌కుమార్ తెలిపారు. 2027లో ఈ సినిమా విడుదల కానుంది. 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా రెండేళ్లకు ఒకటి చొప్పున మొత్తం ఏడు సినిమాలు రానున్నాయి. విష్ణుమూర్తి పది అవతారాలపై ఇవి రూపొందుతున్నాయి.




## మా కోడలు.. స్పోర్ట్స్ హబ్

### కో-ఛైర్‌పర్సన్ అయింది..: చిరు స్పెషల్ పోస్ట్

హైదరాబాద్: తన కోడలు ఉపాసనకు అగ్ర కథానాయకుడు చిరంజీవి శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర స్పోర్ట్స్ హబ్‌కు కో-ఛైర్‌పర్సన్‌గా తెలంగాణ ప్రభుత్వం ఉపాసనను నియమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చిరంజీవి సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టారు. "మా కోడలు ఉపాసన ఇప్పుడు తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-ఛైర్‌పర్సన్. ఆమెను గౌరవప్రదమైన ఈ పదవిలో నియమించడం సంతోషంగా ఉంది. ఇది గౌరవం అనడం కన్నా కూడా బాధ్యతను మరింత పెంచిందని చెప్పాలి. డియర్ ఉపాసన.. మీకున్న నిబద్ధత, ప్యాషన్‌తో క్రీడల్లో దాగి ఉన్న అపార ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారని, ప్రతిభావంతులను అగ్ర స్థానంలో నిలబెట్టడానికి తగిన విధి విధానాలను రూపొందించడంలో నీ వంతు కృషి చేస్తావని ఆశిస్తున్నాను. సదా నీకు దేవుడు దీవెనలు తోడుగా ఉంటాయి" అని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-ఛైర్‌పర్సన్ బాధ్యతను అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఉపాసన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం తనకెంతో గౌరవాన్నిచ్చిందని పేర్కొన్నారు. సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశం రావడం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, తన భార్య ఉపాసనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రామ్‌చరణ్ పోస్టు పెట్టారు. "రేవంత్ రెడ్డి దూరదృష్టి, నాయకత్వంలో స్పోర్ట్స్ పరంగానూ తెలంగాణ మరోస్థాయికి వెళ్లాలని ఆకాంక్షిస్తున్నా" అని పేర్కొన్నారు.

## కూలీలో సైమన్ పాత్రలో ఒదిగిపోయిన నాగ్

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీ ప్రశంసలు




'కూలీ' కథ చెప్పగానే అందులో సైమన్ పాత్ర తాను చేయాలన్నంత ఆసక్తి కలిగిందని దాన్ని నాగార్జున లాంటి నటుడు పోషించి అదరగొట్టారని అగ్ర కథానాయకుడు రజనీకాంత్ అన్నారు. ఆయన కీలక పాత్రలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానుంది. ఈసందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ స్పెషల్ వీడియోతో తెలుగు వారిని పలకరించారు. తెలుగు సినీ ప్రేక్షకులకు నా నమస్కారం. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు. ఈ సంవత్సరంలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నేను నటించిన 'కూలీ' ఆగస్టు 14న రావడం సంతోషంగా ఉంది. తెలుగులో రాజమౌళి ఎలాగో తమిళంలో లోకేశ్ కనగరాజ్ అలా. ఆయన చేసిన సినిమాలన్నీ హిట్. ఇంకొక గొప్ప విషయం ఏంటంటే, ఇందులో పలువురు స్టార్స్ నటించారు. చాలాఏళ్ల తర్వాత సత్యరాజ్‌తో చేస్తున్నా. ఇక శ్రుతిహాసన్, ఉపేంద్ర, సౌబిన్‌లతో పాటు- ఆమిర్‌ఖాన్ స్పెషల్ అపియరెన్స్ ఉంది. ముఖ్యంగా నాగార్జున ఇందులో విలన్‌గా చేస్తున్నారు. అసలు 'కూలీ' సబ్జెక్ట్ విన్న వింటనే సైమన్ పాత్ర నేనే చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆ పాత్ర ఎవరు చేస్తారా? అని ఎదురుచూశా. ఎందుకంటే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఆర్నెళ్ల పాటు వెతికాం.ఈ పాత్ర గురించి ఒక నటుడితో ఆరుసార్లు సిటింగ్ అయింది. అయినా ఓకే అవలేదు' అని లోకేశ్ నాతో అన్నారు. 'ఎవరు ఆయన' అని నేను అడిగా. నాగార్జున పేరు చెప్పగానే ఆశ్చర్యపోయా. ఆ తర్వాత ఆయన ఒప్పుకొన్నారని తెలిసి సంతోషంగా అనిపించింది. ఎందుకంటే, డబ్బు కోసం సినిమాలు చేసే వ్యక్తి కాదు. ఆయనకు ఆ అవసరం లేదు. మేమిద్దరం 33 ఏళ్ల కిందట ఒక సినిమా చేశాం. అప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. నాకు జుట్టు కూడా ఊడిపోయింది. నాగార్జునతో పని చేస్తుండగా 'మీ ఆరోగ్య రహస్యం ఏంటి' అని అడిగాను. 'ఏమీ లేదు సర్.. వ్యాయామం, ఈత, కొద్దిగా డైట్. సాయంత్రం 6 గంటలకు డిన్నర్ అయిపోతుంది. మా తండ్రి నుంచి వచ్చిన జీన్స్ కూడా ఒక కారణం. దాంతో పాటు, నా తండ్రి నాకో సలహా ఇచ్చారు. 'బయట విషయాలు తలలోకి ఎక్కించుకోవద్దని చెప్పారు' అని నాగార్జున నాతో చెప్పారు. 17 రోజుల షెడ్యూల్ కోసం ఇద్దరం థాయ్‌లాండ్ వెళ్లాం. అది నా జీవితంలో మర్చిపోను. సైమన్ పాత్రలో ఆయన నటన చూస్తుంటే, నాకే ఆశ్చర్యమేసింది. బాషా-ఆంటోనీ ఎలాగో.. కూలీ-సైమన్ అలా ఉంటుంది. ఇక ఇందులో అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందరినీ ఆకట్టు-కుంటుందని రజనీకాంత్ అన్నారు.


## జటాధర

### ఫస్ట్ లుక్ అదుర్స్

సుధీర్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రం 'జటాధర'. వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో తేరకెక్కుతున్న ఈ సినిమా లో సుధీర్ బాబుతోపాటు బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్, రవి ప్రకాష్, ఇంద్ర కృష్ణ, నవీన్ నేని, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ నటిస్తున్నారు. జటాధర చిత్రాన్ని ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ నిర్మిస్తుండగా.. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేయగా. ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. 'జటాధర' మూవీకి సంబంధించిన టీ-జర్ ను ఆగస్టు 8న విడుదల చేయబోతున్నట్లు- అధికారంకంగా ప్రకటించారు . అలాగే ఓ పవర్ ఫుల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ప్రజంట్ ఈ న్యూస్ వైరల్ అవుతుండడంతో సుధీర్ బాబు అభిమానులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.



## సైయారా విజయం అద్భుతం : మోహిత్ సూరి




ప్రేక్షకులు ఎలాంటి సినిమాలకు ఎలా రియాక్ట్ అవుతున్నారో చెప్పడం కష్టతరంగా మారింది. వంద కోట్ల బడ్జెట్‌తో వచ్చిన సినిమాలను కనీసం పటించుకోవడంలేదు.. ఊహించని విధంగా చిన్న సినిమాలను మాత్రం ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇందుకు నిదర్శనం 'సైయారా'. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. దీంతో ఈ చిత్ర దర్శకుడు మోహిత్ సూరి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నా 17ఏళ్లు వయస్సులో మొదటిసారి సెట్‌లో అడుగుపెట్టాను. అలా ఐదేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి 22 ఏళ్లకు దర్శకత్వం ప్రారంభించాను. ఇప్పుడు నా వయసు 44 ఏళ్లు. సగం జీవితం సినిమా సెట్‌లలోనే గడిచిపోయింది. అదేంటో తెలీదు కానీ ఆ వాతావరణంలో నేను నాకు నచ్చినట్లు- ఉండగలను. సామాజిక కార్యక్రమాల్లో, ఈవెంట్‌లలో నేను మాములుగా ఉండాలని ప్రయత్నించినా ఇబ్బందిగానే ఉంటుంది. అలాంటి ప్రదేశాల్లో కేవలం దర్శకుడిగా మాత్రమే ఉంటాను. సెట్‌లో మాత్రం అలా కాదు నాకు అక్కడ ఉన్నంత సౌకర్యంగా మరెక్కడా ఉండలేను. జీవితమంతా ఇలానే గడిచిపోవాలని కోరుకుంటున్నాను. నిజజీవితంలో కంటే సెట్‌లోనే స్నేహితులను దక్కించుకున్నాను అని మోహిత్ సూరి తెలిపారు.



## అతడు నాతో సమానం

### నవ్వులు పూయించిన బ్రహ్మానందం

తనదైన శైలిలో మాట్లాడుతూ తెర వెనుకా నటుడు బ్రహ్మానందం నవ్వులు పంచుతుంటారు. సినిమాల వేడుకలైతే మరీ సరదాగా ఉంటారు. సోమవారం నిర్వహించిన 'గుర్రం పాపిరెడ్డి' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మరోసారి తన మార్క్ కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. 'నాతో సమానమైన వ్యక్తి..' అంటూ ఆ సినిమా నిర్మాతల్లో ఒకరైన జయకాంత్ (బాబీ) గురించి మాట్లాడారు. ఆ ప్రొడ్యూసర్ ప్రయాణాన్ని వివరిస్తారేమో అని అనుకునేలోగా 'ఎత్తులో నాతో సమానమైన వ్యక్తి' అని బ్రహ్మానందం అనడంతో కడుపుబ్బా నవ్వడం అతిథుల వంతైంది. ఆ సినిమాలో మరో కీలక పాత్ర పోషించిన యోగిబాబు గురించి బ్రహ్మానందం ప్రత్యేకంగా మాట్లాడారు. "కోలీవుడ్‌లో యోగిబాబుకు ఎంతో క్రేజ్ ఉంది. ఆయన హీరోగా చేసిన ఓ కన్నడ సినిమాలో నేనూ నటించా. చాలా సైలెంట్‌గా ఉంటారాయన. కామెడీ చేసే వ్యక్తిలా కనిపించరు. కానీ, కామెడీని మరోస్థాయికి తీసుకెళ్లగలరు" అని కొనియాడారు. యువ ప్రతిభతో అద్భుతాలు జరుగుతాయని, కొత్తవారు పరిశ్రమకు రావాలని కోరుకునే వ్యక్తినంటూ బ్రహ్మానందం పేర్కొన్నారు. అందుకే 'గుర్రం పాపిరెడ్డి'లో నటించానని తెలిపారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా హీరో-హీరోయిన్లుగా దర్శకుడు మురళీ మనోహర్ తెరకెక్కించిన చిత్రమిది. రాజ్‌కుమార్ కసిరెడ్డి, జీవన్‌కుమార్, వంశీధర్‌లాంటి కమెడియన్లు కీలక పాత్రలు పోషించారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com